సాక్షి ప్రకాశం

మంగళవారం | 4 | జూలై | 2023



గురుభ్యోన్నమః

గురుపౌర్ణమి పర్వదినం సందర్భంగా సోమవారం జిల్లాలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. - IIలో..



రేషన్ సరుకులు సక్రమంగా అందించాలి

రేషన్ సరుకులు సక్రమంగా అందించాలని ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయప్రతాప్‌రెడ్డి ఆదేశించారు. - IIలో..

వాతావరణం

గరిష్టం/కనిష్టం 36 /27

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉంది. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఎస్పీని కలిసిన ట్రైనీ డిప్యూటీ కలెక్టర్



ఎస్పీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న ట్రైనీ డిప్యూటీ కలెక్టర్

ఒంగోలు టౌన్: ప్రకాశం జిల్లాకు శిక్షణ నిమిత్తం వచ్చిన ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ హెలా షారోన్ సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ మలికా గర్గ్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. వారం రోజుల పాటు ప్రాక్టికల్ ట్రైనింగ్ కోసం ఆమెను ప్రకాశం పోలీసు శాఖకు కేటాయించారు. శిక్షణలో భాగంగా ఆమె పోలీసు శాఖలోని వివిధ విభాగాల పనితీరును సంబంధిత అధికారులు, సిబ్బంది ద్వారా తెలుసుకోనున్నారు.

పదో తరగతి విద్యార్థులకు మరో అవకాశం

వేటపాలెం: ప్రభుత్వం పదో తరగతి తప్పిన విద్యార్థులను మళ్లీ స్కూళ్లల్లో చేర్చుకునే సదవకాశాన్ని కల్పించిందని విద్యాశాఖ గుంటూరు ఆర్జేడీ వీఎస్ సుబ్బారావు తెలిపారు. సోమవారం మండల పరిధిలోని కొత్తపేట జిల్లా పరిషత్ హైస్కూల్లో ఈ డ్రైవ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్జేడీ మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా విద్యార్థుల సౌకర్యార్థం ఈవిధానాన్ని ప్రభుత్వం ప్రవేశ పెట్టినట్లు చెప్పారు. పదో తరగతిలో ఫెయిల్ అయిన విద్యార్థులకు మళ్లీ స్కూళ్లలో చేరితే రెగ్యులర్ విద్యార్థులకు మాదిరిగానే ప్రభుత్వపరమైన అన్ని సౌకర్యాలు, పథకాలు వర్తిస్తాయన్నారు. అంతేగాక టెన్త్ క్లాస్ ఈసారి పాస్ అయితే రెగ్యులర్‌గా ఉత్తీర్ణుడైనట్లు సర్టిఫికెట్ కూడా లభిస్తుందని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

ప్రైవేటు విద్యా సంస్థలు ఎల్‌కేజీ నుంచి ఇంజినీరింగ్ వరకూ బస్సులు నడుపుతున్నాయి. ఇప్పటికే కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమైంది. చాలా బస్సులు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు లేకుండానే రోడ్డెక్కుతున్నాయి. ఎలాంటి ప్రమాదం సంభవించినా జరిగే నష్టాన్ని ఎవ్వరూ పూడ్చలేరు. బస్సులు, వ్యాన్ల స్థితి బాగుంటేనే విద్యార్థుల తరలింపునకు అనుమతించాల్సి ఉంటుంది. అటు స్కూళ్ల, కాలేజీల యాజమాన్యాల నిర్లక్ష్య ధోరణి, ఇటు రవాణా శాఖ అధికారుల ఉదాసీనతతో జిల్లాలో వందలాది బస్సులు తిరుగుతున్నాయి. విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. రూ.లక్షల్లో ఫీజులు వసూలు చేసే విద్యా సంస్థలు బస్సుల విషయంలో నిర్లక్ష్యం వహించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

బడి బస్సు భద్రమెంత..?



రోడ్డుపై స్కూలు, కాలేజీ బస్సులను తనిఖీలు చేస్తున్న రవాణా శాఖ అధికారులు, ఎంవీఐ కిరణ్ ప్రభాకర్‌తో పాటు ఇతర అధికారులు

- ఫిట్‌నెస్ లేకుండానే రోడ్డు మీదకు...
- విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే ఫిట్‌నెస్ చేయించుకోవాలి
- జిల్లాలో 405 ప్రైవేటు స్కూళ్లు, కాలేజీలు
- స్కూలు, కాలేజీలకు చెందిన బస్సులు 1,085
- స్వచ్ఛందంగా ఫిట్‌నెస్ చేయించుకున్న బస్సులు 501
- ఎన్‌ఫోర్స్‌మెంట్ ద్వారా ఫిట్‌నెస్ చేయించిన బస్సులు 318
- మరో 266 బస్సులు ఫిట్‌నెస్ లేవు
- నిర్లక్ష్య ధోరణిలో యాజమాన్యాలు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: వేసవి సెలవులు ముగిసి పోయాయి. జూన్ నెలలోనే పాఠశాలలు ప్రారంభమయ్యాయి. పిల్లలు బడి బాట పట్టారు. బడి బస్సుల్లో పాఠశాలలకు వెళ్లే పిల్లల ప్రాణాలకు భద్రత కనిపించటం లేదు. జిల్లాలోని వందలాది స్కూలు, కాలేజీల బస్సులు ఫిట్‌నెస్ లేకుండా రోడ్డెక్కుతున్నాయి. పలు ప్రైవేటు విద్యాసంస్థలకు చెందిన యాజమాన్యాలు బస్సులకు ఫిట్‌నెస్ చేయించే విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి.

జిల్లాలో 405 ప్రైవేటు విద్యా సంస్థలు ఉన్నాయి:

జిల్లాలో ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు మొత్తం కలిపి 405 ఉన్నాయి. ఇవి కాకుండా ప్రభుత్వానికి చెందినవి మెడికల్ కాలేజీ, నర్సింగ్ కాలేజీ, డిగ్రీ, ఇంటర్మీడియెట్, పాలిటెక్నిక్, ఐటీఐ, ఐఐఐటీ, డైట్, పీజీ సెంటర్‌లు కలుపుకొని మరో 57 ఉన్నాయి. ప్రైవేటు యాజమాన్యాలకు చెందినవి జూనియర్ కాలేజీలు 172, డిగ్రీ కాలేజీలు 8, ఇంజినీరింగ్ కాలేజీలు 17, బీఈడీ కాలేజీలు 25, ఎంసీఏ 25, ఎంబీఏ 10, పాలిటెక్నిక్ 14, ఎల్ఎల్‌బీ ఒకటి, ఎం.ఫార్మసీలు 8, ఎంఈ, ఎంటెక్ కాలేజీలు 13, ఐటీఐ కాలేజీలు 40, నర్సింగ్ 5, ఫార్మసీ కాలేజీలు 9, ఫిజియోథెరపీ కాలేజీలు 2 ఉన్నాయి.

266 వాహనాలు ఫిట్‌నెస్ చేయించుకోవాలి:

ప్రైవేటు విద్యా సంస్థలు విద్యార్థినీ, విద్యార్థులను తరలించేందుకు బస్సులు, మినీ బస్సులు, ఆటోలతో పాటు ఇతర నాలుగు చక్రాల వాహనాలను వాడుతున్నారు. జిల్లా కేంద్రం ఒంగోలుతో పాటు దర్శి, మార్కాపురంలలో రవాణా శాఖ కార్యాలయాలు ఉన్నాయి. రవాణా శాఖ అధికారులు ఆయా వాహనాలను నిశితంగా పరిశీలించిన తరువాతే ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు ఇస్తారు.

జిల్లాలో మొత్తం 1,085 వాహనాలు విద్యార్థినీ, విద్యార్థులను పాఠశాలలకు, కళాశాలలకు తరలిస్తున్నాయి. జూన్ 15వ తేదీ వరకు విద్యా సంస్థల యాజమాన్యాలు స్వచ్ఛందంగా జిల్లాలో 501 వాహనాలు మాత్రమే ఫిట్‌నెస్ చేయించుకున్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ ద్వారా 318 బస్సులు, ఇతర వాహనాలకు ఫిట్‌నెస్ చేయించారు. మిగిలిన 266 వాహనాలు ఫిట్‌నెస్ చేయించుకోవాల్సి ఉంది. టైర్లు, స్టీరింగ్, బ్రేకులు, లైట్లు, సీట్లు ఇలా బస్సు మొత్తం కండిషన్‌గా ఉంటేనే రవాణా శాఖ అధికారులు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ జారీ చేస్తారు. ఇది పొందిన తర్వాతే రోడ్డు మీద అవి తిరగాల్సి ఉంటుంది.

నిబంధనలు ఇలా..

- స్కూలు బస్సుపై విద్యా సంస్థ పేరు, ఫోన్ నంబర్, చిరునామా ఉండాలి.
- వాహనానికి ఇరువైపులా అద్దాలు ఏర్పాటు చేయాలి
- డ్రైవర్ కూర్చునే సీటు ముందు కాన్‌కేవ్ అద్దం ఉండాలి.
- డ్రైవర్ వయస్సు 60 ఏళ్లు మించకూడదు.
- డ్రైవింగ్ లైసెన్స్ తప్పని సరి
- వాహనానికి అటెండర్ ఉండాలి
- అగ్నిప్రమాద నివారణ పరికరాలు తప్పనిసరి
- ఎమర్జెన్సీ ఫస్ట్ ఎయిడ్ కిట్ ఉండాలి.
- సీట్లు, టైర్లు, వాహనం కండీషన్, ఇతర సామగ్రి సక్రమంగా ఉన్నాయా? లేదా? అన్నది ప్రధానం



డ్రైవర్లకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డీటీసీ కార్యాలయ ఏవో శ్రీనివాసరావు, వేదికపై డీటీసీ ఆర్.సుశీల, మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు

అధికారుల ఉదాసీనత తోడై...

ఫిట్‌నెస్ లేకుండానే పాఠశాలల, కళాశాలల బస్సులు, ఇతర వాహనాలు తిరుగుతున్నాయంటే రవాణా శాఖ అధికారుల ఉదాసీనతే కారణంగా అర్థమవుతోంది. విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న విద్యా సంస్థల యాజమాన్యాల ఆటకట్టించటంలో రవాణా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అవగాహనా సదస్సులు నిర్వహిస్తున్నామని, ప్రత్యేక తనిఖీలు సైతం చేస్తున్నామని అధికారులు చెబుతున్నారు. అయినా పలు విద్యా సంస్థల యాజమాన్యాలు ఫిట్‌నెట్ సర్టిఫికెట్లు పొందే విషయంలో నిర్లక్ష్యంగా ఉంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.



స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తాం...

పాఠశాలల, కళాశాలకు చెందిన బస్సులు, ఇతర వాహనాల తనిఖీ కోసం స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తాం. ఇప్పటికే జిల్లా యాజమాన్యాలు స్వచ్ఛందంగా బస్సులు, ఇతర వాహనాలను ఫిట్‌నెస్ చేయించుకున్నారు. ఇంకా చేయించుకుంటూనే ఉన్నారు. స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించి ఫిట్‌నెస్ చేయిస్తున్నాం. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహిస్తాం. వాహనాల్లో పరిమితికి మించి విద్యార్థినీ, విద్యార్థులను ఎక్కించరాదు. బస్సులు అటెండెన్స్ బుక్ నిర్వహించాలి. నిబంధనలు ఉల్లంఘించిన బస్సులు, ఇతర వాహనాలపై చర్యలు తీసుకుంటాం.

– ఆర్.సుశీల, డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్, ఒంగోలు

బాధితులకు న్యాయం చేసేందుకే స్పందన

- ప్రతి అర్జీ క్షుణ్ణంగా పరిశీలిస్తాం
- పూర్తిస్థాయిలో సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు
- కలెక్టర్ దినేష్‌కుమార్



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు



హాజరైన అర్జీదారులు

దర్శి: బాధితులకు న్యాయం చేసేందుకే దర్శి నియోజకవర్గంలో ప్రత్యేక స్పందన కార్యక్రమం నిర్వహించినట్లు కలెక్టర్ దినేష్‌కుమార్ అన్నారు. స్థానిక శ్రీశ్రీనివాస పద్మావతి కళ్యాణ మండపంలో జిల్లా స్థాయి స్పందన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి అర్జీలు ఇచ్చేందుకు భారీగా ప్రజలు తరలివచ్చారు. వచ్చిన ప్రజలకు ఇబ్బందులు లేకుండా క్రమపద్ధతిలో వారి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ నియోజకవర్గ స్థాయి స్పందన వలన ఒంగోలుకు దూరప్రాంతంలో ఉండే మార్కాపురం, యర్రగొండపాలెం, దర్శి, కనిగిరి, గిద్దలూరు వంటి నియోజకవర్గాల వారికి సుదూరప్రాంతం రావాల్సిన పనిలేకుండా ఇక్కడే సమస్యలు పరిష్కరించేందుకు మంచి అవకాశం అన్నారు. 372 అర్జీలు వచ్చాయని, గత సంవత్సరం ఇచ్చిన అర్జీలే 40పైగా వచ్చాయని చెప్పారు. ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి నిజమైన బాధితులకు న్యాయం చేస్తామని తెలిపారు. నియోజకవర్గంలో భూ సమస్యలు ఎక్కువగా ఉన్నాయన్నారు. తాత్కాలికంగా పనులు చేయడం కాకుండా 100 శాతం పూర్తి స్థాయిలో సమస్యలు పరిష్కరించి అర్జీదారులను సంతోష పెట్టేలా పనులు చేయాలని అధికారులను ఆదేశించారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా మండల స్థాయిలో ఎంపీడీఓ, తహశీల్దార్, పోలీస్ అధికారులతో ఒక బృందాన్ని ఏర్పాటు చేశామని చెప్పారు. మండల స్థాయిలో అధికారులు టీంలా వెళ్లి రెవెన్యూ సమస్యలపై వచ్చిన అర్జీలు పరిశీలించి సమస్యలు పరిష్కరిస్తారన్నారు. అర్జీలపై సక్రమంగా పనిచేశారా లేదా అని మరొక ఆడిట్ టీంను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. గతంలో వారు సరిగా పని చేయక బాధితుడు సంతృప్తి చెందకపోతే రీ ఓపెన్ 1902 కు చెప్పవచ్చన్నారు. ఆ తరువాత కలెక్టర్, జాయింట్ కలెక్టర్ లు స్వయంగా పరిశీలించి న్యాయం చేస్తారన్నారు.

ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ మాట్లాడుతూ గత సంవత్సరం దర్శిలో జిల్లా స్థాయి స్పందనకు మంచి ఫలితాలు వచ్చాయన్నారు. వచ్చిన అర్జీలు చక్కగా పరిష్కరించారని, అందుకే మళ్లీ దర్శిలో జిల్లా స్థాయి స్పందన కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. జిల్లాకు వచ్చిన అధికారులు, కలెక్టర్‌కు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో జేసీ శ్రీనివాసరావు, డీపీఓ నారాయణరెడ్డి, ఆర్డీఓలు విశ్వేశ్వర రావు, అజయ్‌కుమార్, డ్వామా పీడీ శీనారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ బాబురావు, హౌసింగ్ పీడీ పేరయ్య, జెడ్పీ సీఈఓ జాలిరెడ్డి, గ్రౌండ్‌వాటర్‌డీడీ విద్యాసాగర్, ఆర్‌డబ్ల్యూఎస్ఈ మర్దన్‌అలీ, మెప్మా పీడీ రవికుమార్, ఎస్ఈ కార్పొరేషన్ ఈడీ అర్జున్‌నాయక్, ఈహెచ్ఓ గోపీచంద్, ఏపీఎంఐపీ పీడీ రమణ, డిజైబుల్ ఏడీ అర్చన, ఉపరవాణా శాఖ కమిషనర్ ఆర్ సుశీల, యానిమల్ హజ్బెండరీ జేడీ బేబీరాణి, బీసీ వెల్ఫేర్ డీడీ అంజలాదేవి, ఆత్మపీడీ అన్నపూర్ణ, విద్యుత్ డీఈ రఫి తహశీల్దార్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కుయ్..కుయ్..కొత్తవొచ్చాయ్..

- వైఎస్ఆర్ సీపీ అధికారం చేపట్టగానే జిల్లాకు 27 కొత్త 108 వాహనాలు
- వాటిలో రెండు నియోనేటల్ వాహనాలు
- ఇప్పుడు జిల్లాకు కొత్తగా 14 వాహనాలు
- టీడీపీ ప్రభుత్వంలో 108 వాహనాలు నిర్వీర్యం



కొత్తగా కేటాయించిన 108 వాహనాలు

ఒంగోలు అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తోంది. అందులో భాగంగా ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన తర్వాత ఉమ్మడి జిల్లాకు అత్యాధునిక సదుపాయాలు ఉన్న 108 వాహనాలను 27 కేటాయించారు. అప్పటికి జిల్లాలో 32 వాహనాలు ఉండగా కొత్తగా కేటాయించిన వాటితో మండలానికి ఒక వాహనం చొప్పున ఉంచి, మరో రెండు వాహనాలు అధికంగా రిజర్వుడ్‌లో ఉంచారు. దీంతో మొత్తం 59 వాహనాలయ్యాయి. ఈ నేపథ్యంలో అత్యవసర సేవలందించే 108 వాహనాల్లో చెడిపోయిన వాహనాలను రీప్లేస్ చేశారు. తాజాగా జిల్లాకు 14 పాత వాహనాల స్థానంలో కొత్తవి ప్రభుత్వం అందజేసింది. సోమవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం వద్ద రాష్ట్ర వ్యాప్తంగా చెడిపోయిన వాహనాలను రీప్లేస్ చేస్తూ కొత్త 108 వాహనాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రారంభించారు. అందులో 14 వాహనాలు జిల్లాకు కేటాయించారు. గతంలో ఇచ్చిన 108 వాహనాల్లో రెండు వాహనాలు నియోనేటల్ (నవ జాత శిశువుల అంబులెన్స్)లు ఉన్నాయి. ప్రస్తుతం ఇచ్చిన వాటిలో నెబులైజర్‌తో పాటు ఎముకల సపోర్టు ఉండే పరికరాలు ఉన్నాయి.

గతంలో నిర్వీర్యం

రోడ్డు ప్రమాదాలు, ఇతర అత్యవసర పరిస్థితిల్లో ఆస్పత్రికి వేగంగా చేరేలా దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి 108 వాహనాలను ప్రవేశపెట్టి విజయవంతంగా ప్రజలకు సేవలందించిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత అధికారంలోకి టీడీపీ ప్రభుత్వంలో జిల్లాలో ఉన్న 32 వాహనాలను సక్రమంగా పట్టించుకున్న దాఖలాలు లేవు. దీంతో 108 సేవలు దాదాపుగా నిర్వీర్యమై ప్రజలకు అరకొర సేవలే అందాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 108 వాహనాలకు ప్రాణం పోసింది. వీటితో పాటు 24 తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలు ఇచ్చి ప్రసవం అయిన తల్లి బిడ్డలు క్షేమంగా ఇంటి చేరేలా నిరంతరంగా సేవలు అందిస్తోంది. టీడీపీ ప్రభుత్వంలో కేవలం 12 మాత్రమే 104 వాహనాలు ఉంటే వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత వాటిని 66 వాహనాలకు పెంచి గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు చేపట్టింది. ప్రభుత్వం తీసుకున్న చర్యలతో అటు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, 108 వాహనాల నిర్వాహకులతో పాటు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎదురుచూపు లేదు..

పైసా ఖర్చు లేదు

- జగనన్న సురక్షతో దరఖాస్తుదారులకు మేలు
- కోరిన ధ్రువీకరణ పత్రాలు ఉచితంగా అందజేత
- రోజుల తరబడి ఎదురుచూపు తప్పిందంటూ ఆనందం

ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ రోజుల తరబడి ఎదురుచూపులు లేవు. దరఖాస్తులకు పైసా చెల్లించాల్సిన పనిలేదు. 11 రకాల సేవలను ఉచితంగా సత్వరమే అందించే జగనన్న సురక్ష కార్యక్రమం ఎంతో మందికి అండగా నిలుస్తోంది. తమకు ఎంతో అవసరమైన ధ్రువీకరణ పత్రాలను వలంటీర్లు ఇంటికి వచ్చి మరీ వివరాలు తీసుకుని గంటల వ్యవధిలోనే సర్టిఫికెట్లు అందజేస్తుండటంతో లబ్ధిదారుల ఆనందానికి అవధులు లేకుండాపోతున్నాయి. జిల్లాలో రెండో రోజు సోమవారం అన్ని నియోజకవర్గాల్లో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించి వందలాది మందికి అవసరమైన సర్టిఫికెట్లను ఉచితంగా అందజేశారు. – సాక్షి నెట్‌వర్క్

గంటల వ్యవధిలోనే పంటసాగు హక్కు పత్రం



ఇతని పేరు పి.శ్రీను. యర్రగొండపాలెం మండలంలోని నరసాయపాలెం గ్రామం. 2.50 ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకొని సాగు చేసుకుంటున్నాడు. జగనన్న సురక్ష క్యాంపులో పంటసాగు హక్కు పత్రం కోసం సచివాలయంలో దరఖాస్తు చేసుకున్నాడు. వలంటీరు ఇంటికి వచ్చి రైతుకు అవసరమైన సర్టిఫికెట్ల గురించి అడిగి తెలుసుకున్నారు. అతను కౌలు రైతు కావడం వలన నాలుగేళ్ల నుంచి ప్రభుత్వ పరంగా ఎటువంటి పరిహారం పొందలేక పోయాడు. ఎటువంటి ఖర్చు, ఇబ్బంది లేకుండా పంట సాగు పత్రాన్ని వెంటనే అందజేయడంతో తనకు ఇకపై రైతు భరోసా, పంట నష్టపరిహారం, బ్యాంకు రుణం లభిస్తుందని సంతోషంగా సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపాడు.

సొంత ఊరిలోనే సర్టిఫికెట్‌లు అందజేత



క్యాస్ట్, ఇన్‌కం సర్టిఫికెట్‌లు తీసుకోవాలని బండ్లమూడి గ్రామానికి చెందిన శిరిగిరి శిరీష అనుకుంటోంది. అనుకోకుండా ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమం ప్రారంభం రోజే శనివారం శిరీష సొంత ఊరులో ఏర్పాటు చేయటంతో దరఖాస్తు చేసుకుంది. గంటల వ్యవధిలోనే వాటిని అందజేయడంతో ఆమె ఆనందానికి అవధులు లేవు. గతంలో మండల కేంద్రం చీమకుర్తిలో తహసీల్దార్ కార్యాలయం చుట్టూ రోజుల తరబడి తిరిగినా సర్టిఫికెట్‌లు అందక నిరాశ చెందిన శిరీష తనకు ఈ అవకాశం ఎంతో మేలు చేసిందంటూ హర్షం వ్యక్తం చేసింది.

కోరిన వెంటనే వివాహ ధ్రువీకరణ పత్రం



ఇతని పేరు నాగిరెడ్డి ఎల్లారెడ్డి. పుల్లలచెరువు మండలం పిడికిటివానిపల్లి. జగనన్న సురక్ష కార్యక్రమంలో అవసరమైన ధ్రువీకరణ పత్రాలు ఉచితంగా సత్వరం ఇస్తున్నారని తెలుసుకుని వలంటీర్ ద్వారా వివాహ ధ్రువీకరణ పత్రం కోసం దరఖాస్తు చేసుకున్నాడు. సోమవారం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో అతనికి ఉచితంగా మ్యారేజ్ సర్టి ఫికెట్ అందజేశారు. తాను కోరిన సర్టిఫికెట్‌ను వెంటనే అందించడంతో ఎల్లారెడ్డి హర్షం వ్యక్తం చేశాడు.

రెండు రోజుల్లో కౌలు రైతు గుర్తింపు కార్డు



ఇతని పేరు తోకల శ్రీనివాసరావు. చదలవాడ గ్రామ సచివాలయ పరిధిలోని కేశినేనివారిపాలెం గ్రామానికి చెందిన కౌలు రైతు. వ్యవసాయమే జీవనాధారంగా బతికే ఇతనికి జగనన్న సురక్ష పథకం ద్వారా 2 రోజుల కిందట కౌలు రైతు గుర్తింపు కార్డుకు దరఖాస్తు చేసుకున్నాడు. కౌలు రైతుకు ఉండాల్సిన అర్హతలు అన్నీ పరిశీలించిన అధికారులు తోకల శ్రీనివాసరావుకు రెండు రోజుల్లో కౌలు రైతు ధ్రువీకరణ పత్రం తయారు చేసి సోమవారం చదలవాడ గ్రామ సచివాలయంలో జరిగిన జగనన్న సురక్ష పథకం సభలో అందజేశారు. దరఖాస్తు చేసుకున్న 2 రోజుల్లో కౌలు రైతు పత్రం అందించడం పట్ల తోకల శ్రీను ఆనందం వ్యక్తం చేశాడు.

ఎక్కడికక్కడ సమస్యల పరిష్కారం



ఇతని పేరు వరపర్ల వెంకటేశ్వర్లు. మద్దిపాడు మండలంలోని దొడ్డవరప్పాడు గ్రామం. జగనన్న సురక్ష కార్యక్రమంలో కుల ధ్రువీకరణ, ఆదాయ సర్టిఫికెట్ పొందాడు. గ్రామంలో వాలంటీరు అతని ఇంటికి వచ్చి 60 సంవత్సరాలు నిండిన వారికి పెన్షన్ పెడుతున్నామని చెప్పడంతో అందుకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు తనకు కావాలని వాలంటీర్‌ను అడిగాడు. సదరు వాలంటీర్ పైసా ఖర్చు లేకుండా జగనన్న సురక్ష కార్యక్రమంలో దరఖాస్తు చేసుకుంటే సర్టిఫికెట్ వస్తుందని చెప్పగా ఆయ సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమానికి హాజరై సర్టిఫికెట్లు తీసుకున్నాడు. రూపాయి ఖర్చు లేకుండా సమయం వృథాకాకుండా సర్టి ఫికెట్లు అందించడం పట్ల ప్రభుత్వం చేస్తున్న మంచి కార్యక్రమాన్ని వెంకటేశ్వర్లు అభినందించాడు. ప్రజల వద్దకే మండల స్థాయి అధికారులను పంపి గ్రామస్తుల సమస్యలను పరిష్కరించేలా పరిపాలన చేస్తున్న ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపాడు.

ఇంటి వద్దకు వచ్చి సేవలు అందించారు



ఇతని పేరు కందుల ఆనందబాబు. పొదిలి మండలం ఆముదాలపల్లి పంచాయతీలోని నిమ్మవరం గ్రామం. ఇతనికి భార్య ఇద్దరు పిల్లలు. భార్యభర్తలు ఇద్దరూ రోజువారి కూలి పనులు చేసుకొని జీవనం సాగిస్తుంటారు. ఇద్దరు పిల్లలకు పాఠశాలలో కుల ధ్రువీకరణ సర్టిఫికెట్ అవసరమైంది. ఇంతలోనే వలంటీర్లు వారి ఇంటికి వెళ్లి జగనన్న సురక్ష పథకంలో ఇద్దరు పిల్లలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు ఇప్పిస్తామని చెప్పి వివరాలు తెలుసుకొని టోకెన్ ఇచ్చారు. సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమంలో వారికి అవసరమైన సర్టిఫికెట్లు ఆనందబాబు అందుకున్నాడు. గతంలో కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేది. తహశీల్దారు కార్యాలయం నుంచి వాటిని పొందాలంటే వారం రోజులు సమయం పట్టేది. జగనన్న సురక్ష పథకంలో ఇంటికి వచ్చి నేరుగా ఉచితంగా ధ్రువీకరణ పత్రాలు ఇవ్వడం గొప్ప విషయమని, సీఎంకు ఆనందంబాబు కృతజ్ఞతలు తెలిపాడు.

క్లుప్తంగా

యువకుడి ఆత్మహత్య

మద్దిపాడు: కడుపు నొప్పి భరించలేక మధ్యప్రదేశ్‌కు చెందిన యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆలస్యంగా గుండ్లాపల్లి గ్రోత్‌సెంటర్‌లో వెలుగు చూసింది. వివరాల్లోకి వెళితే.. సత్య గ్రానైట్స్ ఫ్యాక్టరీలో శ్యాంసింగ్ (26) పనిచేస్తున్నాడు. ఇతను కొంతకాలంగా కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. ఈ నెల 1న సెలవు పెట్టి ఆస్పత్రిలో చూయించుకుంటానని ఫ్యాక్టరీ యాజమాన్యం వద్ద అనుమతి తీసుకున్నాడు. అనంతరం కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి కడుపునొప్పి భరించలేకపోతున్నానని, చనిపోతున్నానని చెప్పాడు. సోమవారం ఉదయం శ్యాంసింగ్ కుటుంబసభ్యులు గుండ్లాపల్లి గ్రోత్‌సెంటర్ వద్దకు చేరుకుని వెతుకులాడగా అన్నంగి వెళ్లే దారి సమీపంలో చెట్టుకు ఉరేసుకొని కనిపించడంతో మద్దిపాడు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఏఎస్సై రమేష్ ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వృద్ధుడు మృతి

మద్దిపాడు: గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధుడు మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం అర్ధరాత్రి జరిగింది. వివరాలు.. మద్దిపాడు బీసీ కాలనీకి చెందిన ఏ సుబ్బారావు అనే వృద్ధుడు జాతీయ రహదారికి రెండో వైపున ఉన్న పంజాబీ దాబాకు వెళ్లి భోజనం చేశారు. రాత్రి 12 గంటల సమయంలో కాలనీకి వెళ్లడానికి రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ పేర్కొన్నారు.

రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

గిద్దలూరు రూరల్: మండలంలోని దిగువమెట్ట రైల్వేస్టేషన్ నుంచి నంద్యాల వైపు 3 కిలోమీటర్ల దూరంలో గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. మృతుడు రైలు కింద పడి ఆత్మహత్య పాల్పడ్డాడా, లేక ప్రమాదవశాత్తు జారిపడ్డాడా అన్నది పోలీసుల విచారణలో తెలియాల్సి ఉంది. రైలు పట్టాలకు కొంత మేర దూరంలో మృతదేహం పడి ఉండటంతో రైలులో ప్రయాణిస్తున్న ప్రయాణికుడా లేదా అనేది విచారణలో తెలియాల్సి ఉంది. సమాచారం అందుకున్న నంద్యాల జీఆర్‌పీఎఫ్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం గిద్దలూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా పనిచేయాలి


పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు


మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

- కలెక్టర్ దినేష్‌కుమార్

దర్శి: సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా అధికారులు పనిచేయాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ ఆదేశించారు. జిల్లా అధికారులతో దర్శి నియోజకవర్గస్థాయి సమీక్షా సమావేశం తొలిసారి సోమవారం ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ అధ్యక్షతన నిర్వహించారు. తాగునీరు, ఇళ్ల నిర్మాణం, ఆర్అండ్‌బీ రోడ్లు, విద్యుత్ సబ్‌స్టేషన్లకు భూముల కేటాయింపు, ఎన్ఎస్‌పీ కాలువపై బ్రిడ్జినిర్మాణం తదితర అంశాలపై కలెక్టర్‌తో ప్రజాప్రతినిధులు అధికారులు చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ వ్యవసాయమే జీవనాధారంగా సాగు చేస్తున్న వారికి భూములు కేటాయించేలా అసైన్‌మెంట్ కమిటీ దృష్టికి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటి వరకు మండల ప్రత్యేకాధికారులను నియమించామని తాజాగా నియోజకవర్గాల స్పెషల్ ఆఫీసర్లను కూడా నియమించామన్నారు. దర్శి నియోజకవర్గానికి జిల్లా పంచాయతీ అధికారిని స్పెషల్ ఆఫీసర్‌గా నియమించినట్లు పేర్కొన్నారు. నియోజకవర్గాల్లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై స్పెషలాఫీసర్లు ప్రతి వారం స్థానిక శాసనసభ్యుని సమక్షంలో సమీక్షించాలని కలెక్టర్ ఆదేశించారు.

ప్రతి 15 రోజులకు ఒక సారి చర్యల నివేదిక తనకు పంపించాలన్నారు. ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ మాట్లాడుతూ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ప్రాధాన్యతా ప్రాతిపదికన పూర్తి చేయడంపై దృష్టి సారించామని తెలిపారు. ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి తెచ్చేలా వాటిని అధికారుల దృష్టికి తీసుకువెళ్లామన్నారు. దర్శి, కురిచేడులకు తాగునీరు సరఫరా చేసే ఫిల్టర్‌బెడ్లు దెబ్బతిన్నాయని, వీటిని పరిష్కరించాలని కోరగా నెలరోజుల్లోగా పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామస్థాయిలోని అభివృద్ధి పనులకు స్థానికంగానే టెండర్లు పిలవాలని ఎమ్మెల్యే కోరగా కలెక్టర్ అంగీకరించారు.

దెబ్బతిన్న కురిచేడు–దొనకొండ రోడ్డును బాగు చేయించాలని ఎమ్మెల్యే కోరగా అంచనాలను రూపొందించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. దర్శికి కేటాయించిన టీటీడీ కల్యాణ మండపానికి భూ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరగా ప్రిన్సిపల్ సెక్రటరీకి ప్రత్యేకంగా పంపేలా ఫైల్ సిద్ధం చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. హైస్కూల్, ఇంటర్, డిగ్రీ కళాశాలలు ఒకే ప్రాంగణంలో ఉన్నాయని ప్రత్యేక భవనాలు నిర్మించేలా చర్యలు తీసుకోవాలని కోరగా కలెక్టర్ సుముఖత వ్యక్తం చేశారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె.శ్రీనివాసులు, డీపీఓ నారాయణరెడ్డి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రేషన్ సరుకులు సక్రమంగా అందించాలి

- ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ్‌ప్రతాప్‌రెడ్డి
- త్రిపురాంతకం, పెద్దదోర్నాల మండలాల్లో సుడిగాలి పర్యటన

త్రిపురాంతకం/పెద్దదోర్నాల: ప్రభుత్వం అందజేస్తున్న రేషన్ సరుకులు సక్రమంగా లబ్ధిదారులకు అందించాలని, అదనంగా రుసుం వసూలు చేస్తే చర్యలు తప్పవని ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయప్రతాప్‌రెడ్డి హెచ్చరించారు. త్రిపురాంతకం ఎంపీడీఓ కార్యాలయంలో రేషన్ డీలర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అధిక ధరలు, అక్రమ రవాణాపై తనకు పలు ఫిర్యాదులు అందాయని, అధికారులు విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో ఎంపీపీ కోట్ల సుబ్బారెడ్డి, డీలర్లు పాల్గొన్నారు.

హాస్టళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలల ఆకస్మిక తనిఖీ

త్రిపురాంతకం, గణపవరం, సంఘం తండా, సోమేపల్లి, దూపాడులోని జెడ్పీ ఉన్నత పాఠశాల, బీసీ, ఎస్సీ హాస్టళ్లు, కేజీబీవీ, అంగన్‌వాడీ కేంద్రాలు, ఏపీఆర్ స్కూల్, ఏపీఎస్ డబ్ల్యుఆర్ పాఠశాలలు, రేషన్‌షాప్‌లను ఫుడ్ కమిషన్ చైర్మన్ తనిఖీ చేశారు. విద్యార్థులకు ఫోర్టిఫైడ్ బియ్యం, అందులో ఉండే పోషకాల గురించి వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో రాష్ట్రంలో మూడో స్థానంలో నిలిచిన ఏపీ ఆర్ఎస్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ మోహన్‌రెడ్డిని ప్రత్యేకంగా అభినందించారు. ఆయన వెంట సబ్‌కలెక్టర్ సేథుమాధవన్, డీఎస్ఓ వెంకటేశ్వర్లు, జిల్లా సివిల్ సప్లయ్ మేనేజర్ గ్లోరియా, ఐసీడీఎస్ పీడీ మాధురి, జిల్లా ట్రైబల్ అధికారి వరలక్ష్మి, సోషల్ వెల్ఫేర్ డీడీ లక్ష్మానాయక్, డీవైఈఓ చంద్రమౌళీశ్వర్, తహసీల్దార్ వి.కిరణ్, ఎంఈఓలు కె.తులసిమల్లికార్జున నాయక్, టి.రాజశేఖరరెడ్డి, ఆర్ఐ హరి, వీఆర్‌ఓలు శివలింగయ్య, గురవారెడ్డి ఉన్నారు.


త్రిపురాంతకం ఏపీఆర్ స్కూల్లో విద్యార్థులతో మాట్లాడుతున్న ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ్ ప్రతాప్‌రెడ్డి

■ పెద్దదోర్నాల మండల కేంద్రంలోని ఎస్సీ, ఎస్టీ వసతి వసతి గృహాలు, ఎస్టీ బాలుర రెసిడెన్షియల్ పాఠశాలలను తనిఖీ చేశారు. ఎస్టీ బాలుర పాఠశాలలో మెనూ బోర్డు ఏర్పాటు చేయకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ బాలుర వసతి గృహాల నిర్వహణ సరిగా లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఏకలవ్య మోడల్ పాఠశాల, కస్తూర్బా బాలికల పాఠశాలలను సందర్శించి అక్కడి భోజన పదార్థాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. చైర్మన్ వెంట డీఎస్ఓ ఉదయ భాస్కర్, డిప్యూటీ డైరెక్టర్ సురేష్ తదితరులు ఉన్నారు.

పోలీసు సిబ్బంది సంక్షేమంపై ప్రత్యేక దృష్టి

- ట్రైనీ ఎస్పీ అంకితా సురానా

మార్కాపురం: మార్కాపురం సబ్‌డివిజన్‌లో పనిచేస్తున్న పోలీసు సిబ్బందితోపాటు పశ్చిమ ప్రకాశానికి చెందిన ఇతర జిల్లాల్లో పనిచేస్తున్న పోలీసు సిబ్బంది సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ట్రైనీ ఎస్పీ అంకితా సురానా పేర్కొన్నారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో పోలీసు సిబ్బంది సంక్షేమంపై నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కుటుంబ సభ్యులకు దూరంగా ఉంటూ విధులు నిర్వర్తిస్తున్న పోలీసులకు ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా స్థానిక పోలీసు అధికారులు అండగా ఉంటారన్నారు. సమస్యలను తమ దృష్టికి తీసుకునిరావాలని, కలత చెందవద్దని సూచించారు. డీఎస్పీ వీరరాఘవరెడ్డి మాట్లాడుతూ.. పోలీసు సిబ్బందిని అన్ని విధాలుగా ఆదుకుంటామని చెప్పారు. సీఐ భీమా నాయక్ మాట్లాడుతూ.. పోలీసు అధికారుల కుటుంబ సభ్యులతో కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. తరచుగా సమావేశమై వారి సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎస్సైలు శశికుమార్, రాజేష్, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ట్రైనీ ఎస్పీ అంకితా సురానా

బాలికపై యువకుడి లైంగికదాడి?

ఒంగోలు టౌన్: తన సోదరుడి స్నేహితుడిగా పరిచయమైన ఓ యువకుడు తనపై అత్యాచారం చేశాడని ఓ బాలిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం.. 5వ తరగతి వరకు చదువుకున్న 15 ఏళ్ల బాలిక తల్లి, ఇద్దరు సోదరులతో కలిసి నగరంలోని బిలాల్‌నగర్లో నివాసముంటుంది. తండ్రి కుటుంబాన్ని వదిలివెళ్లడంతో తల్లే పోషిస్తూ ఇద్దరు కుమారులను చదివిస్తోంది. ఈ క్రమంలో తల్లి కూలి పనుల నిమిత్తం నెలరోజులుగా పిడుగురాళ్లలో ఉంటుంది. దాంతో ఆ బాలిక కాలేజీలో చదువుకుంటున్న తన సోదరులకు అన్నం వండి పెడుతూ ఇంటి వద్ద ఒంటరిగా ఉంటుంది. కొద్దిరోజుల కిందట వారింటికి సమీపంలోని ఓ హోటల్ వద్ద ఆమెకు ఓ యువకుడితో పరిచయమైంది. అది కాస్త స్నేహంగా మారింది. ఆ యువకుడి తల్లి యర్రగొండపాలెంలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తోంది. తండ్రి ఆటో డ్రైవర్. దీంతో ఆ యువకుడు కూడా ఇంట్లో ఒంటరిగా ఉండేవాడు. ఈ క్రమంలో యువకుడి తలిదండ్రులిద్దరూ ఇటీవల యాత్రకు వెళ్లారు. ఇదే అదనుగా భావించిన ఆ యువకుడు ఈనెల 15వ తేదీ సదరు బాలికను ఇంటికి తీసుకెళ్లాడు. ఇద్దరూ ఇంట్లోనే కలిసి ఉన్నారు. మధ్యలో ఒకసారి ఆ బాలిక బుర్ఖాలో బయటకు వెళ్లివచ్చినట్లు సమాచారం. కాగా పండగ రావడంతో ఈ నెల 27వ తేది రాత్రి భరత్ నగర్లో బాలికకు తెలిసిన వారి ఇంట వదిలివచ్చాడు. ఆ విషయం బాలిక సోదరుడికి సమాచారం తెలియడంతో భరత్‌నగర్ వెళ్లి బాలికను ఇంటికి తీసుకువచ్చాడు. బాలిక జరిగిన విషయాన్ని సోదరుడికి చెప్పుకుంది. వెంటనే తాలుకా పోలీసుస్టేషన్లో ఫిర్యాదు చేశారు. పోక్సో కేసు నమోదు చేసిన పోలీసులు సోమవారం యువకుడిని అరెస్టు చేశారు. కాగా వారిద్దరూ ఇష్ట ప్రకారం కలిసి ఉన్నా అమ్మాయి మైనర్ కావడంతో లైంగిక దాడి కింద పరిగణిస్తామని, అన్నీ కోణాల్లో విచారణ జరుపుతున్నామని, చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని డీఎస్పీ వి.నారాయణస్వామిరెడ్డి తెలిపారు.

డాక్టర్ వేధిస్తున్నాడని ఏఎన్ఎం ఆత్మహత్యాయత్నం


ఏఎన్ఎం దేవికాబాయిని పరామర్శిస్తున్న లంబాడీ సంఘం నాయకులు

యర్రగొండపాలెం: డాక్టర్ తనను మానసికంగా వేధిస్తున్నాడని ఏఎన్ఎం వైద్యశాలలో ఉన్న యాంటీబయోటిక్ సిరప్ మోతాదుకు మించి తాగి ఆత్మహత్యా యత్నం చేసిన సంఘటన పుల్లలచెరువు మండలంలోని నాయుడుపాలెం పీహెచ్‌సీలో సోమవారం జరిగింది. నాయుడుపాలెం ఆరోగ్య కేంద్రం సబ్‌సెంటర్‌లో ఏఎన్ఎంగా విధులు నిర్వర్తిస్తున్న దేవికాబాయిని ఆ వైద్యశాల డాక్టర్ కంచర్ల నాగార్జునగౌడ్ వేధింపులకు గురిచేస్తున్నాడని, వైద్యశాల వద్దకు, పుల్లలచెరువులో జరిగే కార్యక్రమాల్లో హాజరయ్యేందుకు తన భర్త మోటారుబైక్‌పై తీసుకొని రావటాన్ని డాక్టర్ అభ్యంతరం తెలిపేవాడని, అనుచితంగా ప్రవర్తించేవాడని ఆమె ఆరోపించింది. కొన్ని రోజులుగా ఆయన వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకొని వైద్యశాలలో ఉన్న సిరప్ తాగానని ఆమె తెలిపింది. సంఘటన జరిగిన వెంటనే తన తోటి సిబ్బంది వెంటనే యర్రగొండపాలెంలోని ప్రభుత్వ వైద్యశాలలో చేర్పించారు. డాక్టర్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని లంబాడీ సంక్షేమ సంఘం నాయకులు, ఏఎన్ఎం బంధువులు డిమాండ్ చేశారు. గత ఏప్రిల్ నెలలో స్థానిక మాచర్ల రోడ్డులోని ఆంజనేయస్వామి గుడివద్ద నడుచుకుంటూ పోతున్న ఒకరిని డాక్టర్ తన కారుతో ఢీకొట్టిన కేసు యర్రగొండపాలెం పోలీస్ స్టేషన్‌లో ఉందని వారు తెలిపారు. డాక్టర్ వేధింపులకు తాను ఆత్మహత్యా యత్నం చేసినట్లు స్థానిక పోలీసులకు ఏఎన్ఎం దేవికాబాయి వాంగ్మూలం ఇచ్చింది. కేసు నమోదు చేసి పుల్లలచెరువు పోలీస్ స్టేషన్‌కు తరలిస్తున్నట్లు ఎస్సై జి.కోటయ్య తెలిపారు.

డీఈఐఈడీ థర్డ్ సెమిస్టర్ థియరీ పరీక్షలు

ఒంగోలు అర్బన్: డీఈఐఈడీ థర్డ్ సెమిస్టర్ 2021–23 విద్యార్థులకు జూలై, ఆగస్టు నెలల్లో థియరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు డీఈఓ రమేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ప్రవేశ రుసుం చెల్లించాలని సూచించారు. 6వ తేదీ వరకు ఎటువంటి అపరాధ రుసుం లేకుండా పరీక్ష రుసుం రూ.250, మూడు సబ్జెక్టుల వరకు రూ.175, రెండు సబ్జెక్టుల వరకు రూ.150 చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. జూలై 13వ తేదీ వరకు రూ.50 అపరాధ రుసుంతో ఫీజు చెల్లించవచ్చని తెలిపారు.

సంక్షేమ పథకాల పెన్నిధి జగనన్న

- ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

మార్కాపురం టౌన్: దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అర్హులందరికీ అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సోమవారం సాయంత్రం మార్కాపురం 4వ వార్డులో ఎమ్మెల్యే పర్యటించారు. ముందుగా తూర్పువీధిలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రతి కుటుంబంలోని మహిళలకు ప్రభుత్వ పథకాల లబ్ధిని వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అర్హతే ప్రామాణికంగా.. కుల, మత, పార్టీలకతీతంగా ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల కృష్ణ, వైస్ చైర్మన్లు షేక్ ఇస్మాయిల్, అంజమ్మ శ్రీనివాసులు, శ్రీశైలం దేవస్థానం ట్రస్టు బోర్డు మెంబర్ డాక్టర్ కనకదుర్గ, ఏఎంసీ చైర్మన్ గొలమారి శ్రీనివాసరెడ్డి, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, ఇన్‌చార్జి కమిషనర్ సుభానీ, యూత్ అధ్యక్షుడు బొమ్మిరెడ్డి బాలకృష్ణారెడ్డి, డాక్టర్ మగ్బుల్ బాషా, స్థానిక నాయకులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.


సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి

ఏఎంసీ మాజీ చైర్మన్‌కు పరామర్శ

మార్కాపురం ఏఎంసీ మాజీ చైర్మన్ గుంటక సుబ్బారెడ్డిని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పరామర్శించారు. హైదరాబాద్‌లో వైద్యం చేయించుకుని మార్కాపురం వచ్చిన సుబ్బారెడ్డితో మాట్లాడి ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు.

స్పందన అర్జీలు సకాలంలో పరిష్కారం

- డీఆర్‌ఓ శ్రీలత

ఒంగోలు అర్బన్: స్పందన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను సకాలంలో పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి శ్రీలత అధికారులకు సూచించారు. స్పందన భవనంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రజల సంతృప్తి స్థాయి పెరిగేలా సహేతుకంగా పరిష్కరించి సమస్య పునరావృతం కాకుండా చూడాలన్నారు. జగనన్నకు చెబుదాం ద్వారా వచ్చిన అర్జీలను ప్రత్యేక శ్రద్ధతో పరిష్కరించాలన్నారు. నిర్ణీత గడువులోగా అర్జీలను పరిష్కరించాలని, పరిష్కరించలేని సమస్యలైతే అర్జీదారులను పిలిచి వారికి ఎందుకు పరిష్కరించలేకపోతున్నామో వివరించాలన్నారు. దీనిలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

■ జరుగుమల్లి మండలం వర్ధినేనిపాలెం గ్రామస్తులు..అంగన్‌వాడీ కేంద్రంలో పనిచేస్తున్న ఆయాకు టీచర్‌గా నియమించవద్దంటూ ఫిర్యాదు చేశారు. అంగన్‌వాడీ కేంద్రంలో ఉన్న టీచర్ ఈ నెల చివరకు రిటైర్డ్ అవుతుందని ఖాళీ అయిన స్థానాన్ని మరొకరికి కేటాయించాలని అక్కడే పనిచేస్తున్న ఆయా ఆ విధులే సక్రమంగా నిర్వర్తించడం లేదని ఆమెకు టీచర్‌గా కేటాయిస్తే గ్రామస్తులెవరు పిల్లలను పంపించరని ఫిర్యాదులో పేర్కొన్నారు.


స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా రెవిన్యూ అధికారి శ్రీలత


■ కొత్తపట్నం మండలం సంకువానికుంటకు చెందిన ఆరె చందన స్పందనలో అధికారులను కలిసి తనకు చీమకుర్తి, కొండపిల్లో ఒక ప్రాంతంలోని గురుకుల పాఠశాలలో సీటు ఇప్పించాలని కోరుతూ అర్జీ అందచేసింది. తమది పేద కుటుంబమని ముగ్గురు అక్కాచెల్లెలం ఉంటున్నామని, ఫీజులు చెల్లించి చదువుకునే పరిస్థితి లేదని తనకు సీటు ఇప్పించి ఆదుకోవాలని కోరుతూ అర్జీ అందచేసింది.

పెట్రోల్ బంకు డీలర్‌షిప్ పేరుతో మోసం


- నకిలీ అపాయింట్‌మెంట్ ఇచ్చినట్లు ఎస్పీ మలికా గర్గ్‌కు మొర
- పోలీస్ స్పందనలో వెల్లువెత్తిన ఫిర్యాదులు

ఒంగోలు టౌన్: పెట్రోలు బంకు డీలర్‌షిప్‌కు సంబంధించి ఎన్వోసీ ఇప్పిస్తామని చెప్పి ఉపేంద్ర షెనాయ్ తోపాటు మరో ఇద్దరు వ్యక్తులు రూ.6.50 లక్షలు తీసుకుని తమను మోసం చేశారని అర్ధవీడుకు చెందిన పి.సహజ అనే మహిళ ఎస్పీ మలికా గర్గ్‌కు ఫిర్యాదు చేశారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో ఆమె ఎస్పీని కలిశారు. రోజులు గడుస్తున్నా ఎలాంటి జవాబు లేకపోవడంతో డబ్బు తిరిగి ఇవ్వాలని కోరగా ఇబ్బంది పెడుతున్నారని వాపోయారు.

■ కనిగిరి ఎంపీడీఓ కార్యాలయంలో డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి ఒంగోలుకు చెందిన విప్పగుంట వెంకటేష్ రూ.1.25 లక్షలు తీసుకుని మోసం చేశాడని మార్కాపురానికి చెందిన ఎం.మల్లికార్జునరావు ఫిర్యాదు చేశారు. నకిలీ అపాయింట్‌మెంట్ ఇచ్చి మోసం చేశాడని ఎస్పీ దృష్టికి తీసుకొచ్చారు. జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన 94 మంది తమ సమస్యలపై ఫిర్యాదులను ఎస్పీకి అందజేశారు. నేరుగా ఫిర్యాదులు స్వీకరించిన ఎస్పీ సంబంధిత పోలీసు అధికారులతో మాట్లాడి సత్వరమే సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఏఎస్పీ(క్రైం) శ్రీధరరావు, ఒంగోలు ట్రాఫిక్ డీఎస్పీ వి.శ్రీనివాసరావు, ఐసీసీఆర్ సీఐ దుర్గాప్రసాద్, ప్యానల్ అడ్వకేట్ బీవీ శివరామకృష్ణ, స్పందన ఎస్సైలు పాల్గొన్నారు.


ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ మలికా గర్గ్


ఒంగోలులోని లాయర్‌పేట సాయి మందిరానికి పోటెత్తిన భక్తులు



గురుభ్యోన్నమః

గురుపౌర్ణమి వేడుకలను జిల్లా వ్యాప్తంగా సోమవారం ఘనంగా నిర్వహించారు. సాయినాథునికి హారతి ఇవ్వడంతోపాటు విశేష పూజలు, అభిషేకాలు చేశారు. – సాక్షి, ఒంగోలు



ఒంగోలు 3వ డివిజన్‌లో లబ్ధిదారుడికి సర్టిఫికెట్ అందిస్తున్న మేయర్ గంగాడ సుజాత, కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒక్క రోజులోనే ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్...



నాగులుప్పలపాడు మండలం అమ్మనబ్రోలు గ్రామానికి చెందిన బొడ్డు విమలమ్మ భర్త బొడ్డు ఆంజనేయులు ఏడాది క్రితం మరణించారు. ఆ కుటుంబానికి ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ అవసరమైంది. దాని కోసం గతంలో దరఖాస్తు చేసుకున్నారు. లాయర్ నోటరీ అందించకపోవడంతో దరఖాస్తును తిరస్కరించారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమంలో దరఖాస్తు చేసుకోగా, ఒక్క రోజులోనే ఎలాంటి రుసుం లేకుండా ఆ కుటుంబానికి ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ అందించడంతో విమలమ్మ, ఇతర కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. జగనన్న సురక్ష కార్యక్రమంతో ఎంతో మందికి ఈ విధంగా లబ్ధిచేకూరుతుండటంపై ప్రజలు హర్షిస్తున్నారు.

వెంటనే సర్టిఫికెట్ ఇస్తారని ఊహించలేదు...



ఈమె పేరు నల్లమల శ్రీచారాణి. కొత్తపట్నం మండలం అల్లూరు గ్రామంలోని ఎస్సీకాలనీలో నివాసం ఉంటున్నారు. కుల ధ్రువీకరణ పత్రం కోసం అల్లూరు–2 సచివాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా వలంటీర్ ఆమె ఇంటికెళ్లి వివరాలు సేకరించి యాప్‌లో రిజిస్టర్ చేసి సోమవారం సర్టిఫికెట్ అందజేయడంతో ఆనందం వ్యక్తం చేశారు. ఒకేఒక్క రోజులో పైసా ఖర్చులేకుండా గ్రామ సభలో ఎంతో గౌరవంగా సర్టిఫికెట్ ఇస్తారని ఊహించలేదని శ్రీచారాణి అన్నారు. ఇలాంటి గొప్ప కార్యక్రమాన్ని చేపట్టిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామంటూ కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల వద్దకు పాలన అందించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.

జగనన్న సురక్షను సద్వినియోగం చేసుకోండి

● ఒంగోలు మేయర్ గంగాడ సుజాత పిలుపు

ఒంగోలు సబర్బన్: జగనన్న సురక్ష పథకంలో ప్రతి సర్టిఫికెట్‌ను ఉచితంగానే ఇస్తున్నామని, ప్రజలు దరఖాస్తు చేసుకుని సద్వినియోగం చేసుకోవాలని ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత పిలుపునిచ్చారు. ఒంగోలులోని మూడో డివిజన్‌లో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ మూడో డివిజన్ పరిధిలోని పానుగుపాటివారికాలనీ, బలరాం కాలనీ సచివాలయాల పరిధిలోని వారికి 690 సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్నామన్నారు. అందులో భాగంగా వారం రోజుల సర్వేలో పానుగుపాటివారికాలనీ సచివాలయం పరిధిలో 304 సర్టిఫికెట్లు, బలరాం కాలనీ సచివాలయం పరిధిలో 386 సర్టిఫికెట్లు అందిస్తున్నామన్నారు. లబ్ధిదారుల నుంచి ఎలాంటి ఫీజు లేకుండానే ఉచితంగా అందిస్తున్నామని వెల్లడించారు. అనంతరం లబ్ధిదారులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు, మూడో డివిజన్ కార్పొరేటర్ గండు ధనలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు కఠారి శంకర్, గోలి తిరుపతిరావు, సిబ్బంది పాల్గొన్నారు.

12వ డివిజన్‌లో జగనన్న సురక్ష సర్వే ప్రారంభం...

ఒంగోలు నగరంలోని 12వ డివిజన్‌లో జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ఇంటింటి సర్వేని కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు సోమవారం ప్రారంభించారు. ముందుగా డివిజన్‌లోని రంగుతోట, మరాఠిపాలెం వార్డు సచివాలయాల్లోని వలంటీర్లు, సచివాలయాల సిబ్బందికి అవగాహన కల్పించారు. అనంతరం రెండు సచివాలయాల పరిధిలో ఇంటింటి సర్వే చేపట్టారు. ఈ సచివాలయాల పరిధిలో ఈ నెల 10వ తేదీ నిర్వహించనున్న క్యాంపునకు అర్హులను తీసుకురావాలని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ 12వ డివిజన్ అధ్యక్షుడు కఠారి లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థ ద్వారా సమూల మార్పులు...

ఒంగోలు రూరల్: సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ ద్వారా దేశంలో ఎక్కడా లేని విధంగా సమూల మార్పులు వచ్చినట్లు ఒంగోలు ఎంపీపీ పల్లపోలు మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కరవది సచివాలయం–1లో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ డి.కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీతో పాటు ఒంగోలు తహసీల్దార్ పసుపులేటి మురళి, ఎంపీడీవో పి.అజిత, ఎంపీటీసీ మన్నె శ్రీనివాసరావు, ఎంపీటీసీ–2 కోమలి, సొసైటీ చైర్మన్ వాకా కృష్ణారెడ్డి పాల్గొని మాట్లాడారు. కరవది–1 సచివాలయం 973 సర్వీసులతో 2వ స్థానంలో ఉందని ఎంపీడీవో తెలిపారు. చింతాయగారిపాలెం సచివాలయం 1050 సర్వీసులతో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించిందన్నారు. 5వ తేదీ జరగనున్న జగనన్న సురక్ష కార్యక్రమంలో చింతాయగారిపాలెం సర్వీసులను అధిగమించాలని సిబ్బందికి పిలుపునిచ్చారు. ఎంపీపీ పల్లపోలు మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి త్వరలో గిన్నిస్‌బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డుకు ఎక్కుతారన్నారు. వలంటీర్లకు సేవారత్న, సేవామిత్ర అవార్డులు అందజేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఇంటిని జల్లెడ పట్టండి...

అల్లూరు (కొత్తపట్నం): ప్రతి ఇంటిని జల్లెడపట్టి అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు అవసరమైన సర్టిఫికెట్లు అందించాలని కొత్తపట్నం ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి అధికారులకు సూచించారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా అల్లూరు సచివాలయం–2 ఆవరణలో సర్పంచ్ నంబూరి సూర్యనారాయణ అధ్యక్షతన సోమవారం గ్రామ సభ నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో చెప్పిన విధంగా 90 శాతం హామీలు నెరవేర్చారని, మిగిలిన 10 శాతం కూడా పూర్తి చేసి నూరు శాతం పథకాలు అమలు చేయాలనే ఉద్దేశంతో జగనన్న సురక్ష కార్యక్రమం చేపట్టారని వివరించారు. అన్ని ఇళ్లకు తిరిగి జగనన్న సురక్ష కార్యక్రమం గురించి అవగాహన కల్పించాలన్నారు. మండలంలో 15 మంది సర్వేయర్లు ఉంటే 11 మందికి భూమి కొలతలు కొలవడం చేతకావడం లేదని, ఫీల్డ్ మీదకు వెళ్లి కొలతలు కొలిచే విధంగా నేర్చుకోవాలని సూచించారు. రెవెన్యూ సమస్యలు అనేకం ఉన్నాయని, కింది స్థాయి ఉద్యోగులు బాధ్యతగా పనిచేసి పరిష్కరించాలని ఎంపీపీ కోరారు. సచివాలయ సిబ్బంది పనితీరును అభినందించారు. డెత్ సర్టిఫికెట్ల కోసం లబ్ధిదారులు పడిగాపులు కాస్తున్నారని, వెంటనే అందించేందుకు చర్యలు తీసుకోవాలని డీటీ అర్జున్‌రెడ్డిని కోరారు. అనంతరం 375 మందికి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. అక్కడే ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంప్‌లో వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో డాక్టర్ పి.సుజాత, ఎంపీటీసీ సభ్యుడు మిట్నసల శాంతారావు, వైఎస్సార్ సీపీ నాయకుడు వీరేపల్లి రామచంద్రారెడ్డి, కోఆప్షన్ మెంబర్ బాజీ, ఐపీ రామారావు, చెంచమ్మ, హిమబిందు, హరిబాబు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఈతముక్కలలో...

జిల్లా అగ్రికల్చర్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ ఆళ్ల రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఈతముక్కలలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. పలువురికి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. తహసీల్దార్ బీవీ రమణారావు, ఈవోఆర్డీ ఏ బాలచెన్నయ్య, సర్పంచ్ సునీత, ఎంపీటీసీ సభ్యురాలు బందారు రుక్మిణమ్మ, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో అర్హులందరికీ లబ్ధి...

నాగులుప్పలపాడు: ప్రజలకు అందించే సేవలను మరింత మెరుగ్గా అమలు చేసేందుకు క్షేత్రస్థాయిలో లబ్ధిదారులను ఎంపిక చేసి వారికి అవసరమైన ధ్రువీకరణ పత్రాలను ఉచితంగా ఇంటి వద్దకు వెళ్లి అందించే కార్యక్రమమే జగనన్న సురక్ష అని ఎంపీపీ నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి వివరించారు. మండలంలోని చదలవాడ, చీర్వానుప్పలపాడు సచివాలయాలలో సోమవారం నిర్వహించిన జగనన్న సురక్ష గ్రామ సభల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. చదలవాడ గ్రామ సచివాలయంలో 265 మంది అర్హులకు వివిధ రకాల సర్టిఫికెట్లు అందజేశారు. చీర్వానుప్పలపాడు గ్రామంలో 92 మంది లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో మద్దిపాడు ఏఎంసీ చైర్మన్ మారెళ్ల బంగారుబాబు, తహసీల్దార్ సుజన్‌కుమార్, ఎంపీడీవో జయమణి, లిడ్ క్యాప్ స్టేట్ డైరెక్టర్ కంచర్ల సుధాకర్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోలవరపు శ్రీమన్నారాయణ, సర్పంచ్‌లు దాసరి వరప్రసాదరావు, మేడికొండ చెన్నమ్మ, ఎంపీటీసీలు పాద పవన్‌కుమార్, సచివాలయాల కన్వీనర్ తోకల శ్రీను, గ్రామస్తులు పాల్గొన్నారు.

మద్దిరాలపాడు, మాచవరం గ్రామాల్లో...

నాగులుప్పలపాడు మండలంలోని మద్దిరాలపాడు, మాచవరం గ్రామాల్లో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో మద్దిపాడు ఏఎంసీ చైర్మన్ మారెళ్ల బంగారుబాబు, రాపర్ల సొసైటీ చైర్మన్ ఇనగంటి వెంకట రమణారెడ్డి పాల్గొని సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు పలు సలహాలు, సూచనలు చేశారు. ప్రతి ఒక్కరికి అవసరమైన సర్టిఫికెట్లు ఉచితంగా అందజేయాలని తెలిపారు.

అర్హులందరికీ సర్టిఫికెట్లు అందించాలి...

మద్దిపాడు: అర్హులందరికీ అవసరమైన సర్టిఫికెట్లు త్వరితగతిన అందించేందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని మద్దిపాడు ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని దొడ్డవరప్పాడులో సోమవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పథకాలకు అర్హత పొందడానికి సర్టిఫికెట్లు అవసరమైన వారికి ఈ కార్యక్రమం బాగా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. విద్యార్థులకు అవసరమైన అన్నిరకాల సర్టిఫికెట్లు ఉచితంగా ఇవ్వడం వలన వారికి డబ్బుతో పాటు సమయం ఆదా అవుతుందని అన్నారు. ఈ కార్యక్రమం వలన అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మండవ అప్పారావు, గ్రామ సర్పంచ్ బెజవాడ రాము, నాయకులు గుడ్డపాతల రవి, జేసీఎస్ మండల కన్వీనర్ బత్తుల శ్రీనివాసరావు, తహసీల్దార్ రజనీకుమారి, ఏవో సుబ్బారావు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పెదకొత్తపల్లిలో...

మద్దిపాడు ఎంపీడీవో శ్రీనివాసరావు ఆధ్వర్యంలో డీటీ జ్యోతి పెదకొత్తపల్లి గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. గట్టినేని అయ్యన్న, పోతినేని శ్రీనివాసరావు, సర్పంచ్ కాకి శైలజ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మైనంపాడులో...

చీమకుర్తి: సంతనూతలపాడు మండలం మైనంపాడులో సోమవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో 312 మందికి అవసరమైన సర్టిఫికెట్లను అక్కడికక్కడే సిద్ధం చేసి పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి, తహసీల్దార్ నారాయణరెడ్డి, సర్పంచ్ డీ రమణ, ఎంపీటీసీ ఏ రాజకుమారి, జీ సుబ్బారావు, దుంపా యలమందారెడ్డి, స్థానికులు పాల్గొన్నారు.



అగ్రహారంలో లబ్ధిదారుడికు సర్టిఫికెట్ అందిస్తున్న ఎంపీపీ నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి, నాయకులు



మాచవరంలో సిబ్బందితో మాట్లాడుతున్న రాపర్ల సొసైటీ చైర్మన్ ఇనగంటి రమణారెడ్డి



దొడ్డవరప్పాడులో సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి, తహసీల్దార్ రజనీకుమారి



మైనంపాడులో సర్టిఫికెట్లు అందిస్తున్న దుంపా చెంచిరెడ్డి



కరవదిలో సర్టిఫికెట్లు అందిస్తున్న తహసీల్దార్, ఎంపీడీవో, ఎంపీపీ



అల్లూరులో సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి, అధికారులు

పేదల కుటుంబాల్లో వెలుగులు నింపిన జగన్



సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు

● గడప గడపలో జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు

చీమకుర్తి: పేదల కుటుంబాలు ఆర్థికంగా మెరుగుపడాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాల ద్వారా వారి జీవితాల్లో వెలుగులు నింపారని జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు అన్నారు. సోమవారం ఏలూరివారిపాలెం గ్రామంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో సంక్షేమ పథకాలు పొందిన లబ్ధిదారులతో బూచేపల్లి వెంకాయమ్మ, టీజేఆర్ సుధాకర్‌బాబు మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వాలు అందించనన్ని సంక్షేమ పథకాలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత నాలుగేళ్లలో అందించారన్నారు. దాని వలన పేదలు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి దోహదపడినట్లు తెలిపారు. పేదలకు అండగా నిలిచిన జగన్‌మోహన్‌రెడ్డికి రానున్న ఎన్నికల్లో దీవెనలు అందించాలని విజ్ఞప్తి చేశారు. సంక్షేమ పథకాలు నిరంతరం పేదలకు అందాలంటే మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. సంక్షేమ పథకాల బుక్‌లెట్లను ఇంటింటికి తిరిగి లబ్ధిదారులకు అందించి ఎంతెంత ఆర్థిక ప్రయోజనం కలిగిందో స్వయంగా వారు వివరించారు. గ్రామంలోని మంచినీటి చెరువు సాగర్ నీటితో కళకళలాడుతుండగా బూచేపల్లి వెంకాయమ్మ, టీజేఆర్ సుధాకర్‌బాబు కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు. స్థానిక రాములవారి ఆలయంలోనూ పూజలు నిర్వహించారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో మాట్లాడుతూ జగనన్న విద్యా కానుక కిట్ల ద్వారా యూనిఫాం, షూ, బ్యాగ్‌లు ఇచ్చారా అని అడిగి తెలుసుకున్నారు. తాగునీటి వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. తొలుత గ్రామంలోకి ప్రవేశించిన సమయంలో స్థానిక సర్పంచ్ ఏలూరి శ్రీలక్ష్మి, సురేష్, సుబ్బారావు ఆధ్వర్యంలో డప్పు వాయిద్యాలతో ఘనంగా స్వాగతం పలికారు. గడపగడపలో బూచేపల్లి వెంకాయమ్మ, టీజేఆర్ సుధాకర్‌బాబును గజమాలలతో శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. రెండు రోజుల నుంచి కూనంనేనివారిపాలెం, ఏలూరివారిపాలెం గ్రామాల్లో మొత్తం 1,030 ఇళ్లను సందర్శించారు. కార్యక్రమంలో ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యుడు వేమా శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ చీమకుర్తి రూరల్ కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు, పట్టణ కన్వీనర్ క్రిష్టిపాటి శేఖరరెడ్డి, మన్నం శ్రీధర్, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతినాయకుడి పాత్రకు ప్రాణం పోసిన ఎస్వీఆర్



ఎస్వీఆర్ జయంతి సభలో మాట్లాడుతున్న ట్రాఫిక్ డీఎస్పీ శ్రీనివాసరావు

ఒంగోలు టౌన్: పౌరాణిక సినిమాల్లో ప్రతినాయక పాత్రలకు ప్రాణప్రతిష్ట చేసిన ఎస్వీ రంగారావు తెలుగు వెండితెరపై సువర్ణాక్షరాలతో తన పేరును లిఖించుకున్నారని ట్రాఫిక్ డీఎస్పీ వి.శ్రీనివాసరావు కొనియాడారు. ఎస్వీఆర్ కళాపరిషత్ ఆధ్వర్యంలో సీవీఎన్ రీడింగ్ రూంలో సోమవారం మహానటుడు ఎస్వీఆర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు గొర్రెపాటి శ్రీనివాసరావు జ్యోతి ప్రజ్వలన చేశారు. ఒంగోలు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ అయినాబత్తుని ఘనశ్యాం సభకు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ట్రాఫిక్ డీఎస్పీ మాట్లాడుతూ మూడు దశాబ్దాలపాటు 300 సినిమాల్లో నటించిన ఎస్వీఆర్ తెలుగువారు కావడం తెలుగు ప్రజల అదృష్టమన్నారు. అనంతరం వివిధ రంగాలకు చెందిన జూనియర్ డీవీ సుబ్బారావు, లంకపోతు అంజిరెడ్డి, నీట్ అకాడమీ జనార్దన్, కనుమాల రాఘవులు, తాళ్ల సత్యనారాయణ, మంచాల రామకృష్ణ, పూజల సాంబశివరావు, శ్రీరాం వెంకటేశ్వర్లును సంస్థ అధ్యక్షులు గుండ్రెడ్డి బాలాజీ రావు ఘనంగా సత్కరించారు. సభలో కాపు నాయకులు గాదె కృష్ణ, కుర్రా ప్రసాద్ బాబు, ఈదుపల్లి గురునాథరావు, చాకిరి ధనుంజయ, కాపుసంఘం నాయకులు కొక్కిరాల సంజీవ్ కుమార్, జక్కా సాయిబాబు, దాచర్ల విజయ్ కుమార్, చిమ్మిరి వెంకట రామారావు తదితరులు ప్రసంగించారు. ఈ సందర్భంగా సత్యహరిశ్చంద్ర లోని వివిధ ఘట్టాలను ప్రదర్శించారు. ఎస్వీఆర్ కళాపరిషత్ ఉపాధ్యక్షుడు ధర్నాసి బ్రహ్మానందం, కార్యదర్శి నగులూరు రామమూర్తి పర్యవేక్షించారు.

ఉపాధ్యాయులకు ఆత్మీయ సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంపీటీసీ, ఎంఈవో

మద్దిపాడు: మండలంలోని కారుమూడివారిపాలెం ఎంపీపీ మెయిన్ పాఠశాలలో గత 8 సంవత్సరాలుగా పనిచేసి ఇటీవల బదిలీ అయిన హెచ్‌ఎం నరసింహారావు, ఉపాధ్యాయినులు సువార్త, వజ్రకుమారిలను నూతన హెచ్‌ఎం పీ నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు ఎం.ఇందిర, కె.నరసింహారావు సోమవారం పాఠశాలలో ఘనంగా సన్మానించారు. ఎంపీటీసీ పద్మకుమారి, ఎంఈఓ ఎంవీఆర్ ఆంజనేయులు, ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ప్రభాకర్‌రావు, ఏపీటీఎఫ్ జనరల్ సెక్రటరీ ఈమని శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ గ్రామ నాయకుడు యేమిరెడ్డి భాస్కరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



తెగిపడిన విద్యుత్ తీగ

ఒంగోలు సబర్బన్: నగరంలో సోమవారం రాత్రి ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. మున్సిపల్ ఆఫీసు మీదుగా శర్మ కళాశాలకు వెళ్లే కూడలిలో ఈదురుగాలుల తాకిడికి విద్యుత్ తీగ తెగిపడింది. ఆ సమయంలో రోడ్డుపై ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. అప్రమత్తమైన స్థానికులు అటుగా ఎవరూ వెళ్లకుండా నిలిపేశారు. విద్యుత్ శాఖాధికారులకు సమాచారం అందించారు. ఒంగోలు డీ2 సబ్‌స్టేషన్ ఏఈ డి.వెంకటేశ్వర్లు సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని తెగిపడిన విద్యుత్ లైన్‌కు మరమ్మతులు చేశారు. కొంతసేపు శివాలయం సెంటర్, మున్సిపల్ ఆఫీసు ఏరియా, దేవుడు చెరువు, శర్మ కాలేజీ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడింది.

ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు

కొత్తపట్నం: స్థానిక షిర్డీ సాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. మందిర చైర్మన్ కూరపాటి ప్రకాశ్‌రావు ఆధ్వర్యంలో బాబాను పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలచే 108 కలశాలతో గ్రామోత్సవం నిర్వహించారు. కలశాలకు భక్తులు హారతులిచ్చారు. సాయిబాబా ఆలయం నుంచి శివాలయం వీధి, ఈతముక్కల రోడ్డు, బస్టాండ్ సెంటర్, ఆంజనేయస్వామి ఆలయం, పోస్టాఫీస్ బజారు మీదుగా ఆలయానికి చేరుకుని మహిళల స్వహస్తాలతో బాబాకు అభిషేకం చేశారు. అనంతరం విశ్రాంత ఉపాధ్యాయుడు ఆర్‌ఎల్‌ఎస్ ప్రసాద్‌రావుకు ఆలయ మర్యాదలతో గురుసన్మానం చేశారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



సంతపేటలో పూజలందుకుంటున్న సాయిబాబా

పేర్నమిట్టలో...

చీమకుర్తి: గురుపౌర్ణమి సందర్భంగా సోమవారం పలు సాయిబాబా మందిరాలలో పూజలు చేశారు. పేర్నమిట్టలోని సుందరసాయి మందిరంలో భక్తుల దర్శనం అనంతరం అన్నసంతర్పణ చేశారు. సంతనూతలపాడులోని మట్టా మురళీకృష్ణ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.



సంతనూతలపాడులో పూజలు చేస్తున్న భక్తులు



కొత్తపట్నంలో 108 కలశాలతో గ్రామోత్సవం నిర్వహిస్తున్న మహిళలు



లాయర్‌పేటలో సాయిబాబాకు పూజలు చేస్తున్న భక్తులు

జీవో నంబర్ 58ని అమలు చేయాలి

ఒంగోలు టౌన్: జీవో నంబర్ 58ని అమలు చేయాలని ఎయిడెడ్ ఉపాధ్యాయుల జిల్లా కమిటీ సమావేశం డిమాండ్ చేసింది. సోమవారం ఏపీటీజీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశానికి కె.వెంకటరావు అధ్యక్షత వహించారు. ప్రభుత్వంలో విలీనమైన ఎయిడెడ్ ఉపాధ్యాయులకు పదోన్నతులకు అవకాశం కల్పించాలని, విద్యార్థులు లేని, ఆర్‌సీఎం యాజమాన్యాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించాలని కోరారు. ఇంకా పలు తీర్మానాలు చేశారు. సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కోరారు. సమావేశంలో ఆంధ్రప్రదేశ్ టీచర్స్ గిల్డ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ ప్రభాకరరెడ్డి పాల్గొన్నారు.

ఎంఈఓ–1గా చంద్రమౌళీశ్వరరావు

చీమకుర్తి: సంతనూతలపాడు ఎంఈఓ–1గా ఏ చంద్రమౌళీశ్వరరావు స్థానిక ఎంఆర్‌సీ కార్యాలయంలో సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆదివారం జరిగిన ఎంఈఓల బదిలీల కౌన్సెలింగ్‌లో ఉలవపాడు మండలం రామాయపట్నం నుంచి సంతనూతలపాడుకు ఆయన వచ్చారు. ఈ సందర్భంగా ఎంఈఓ–2 డీ వెంకారెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

సామజవరగమన టీం సందడి

ఒంగోలు టౌన్: విజయయాత్రలో భాగంగా సామజవరగమన సినిమా టీం ఆదివారం రాత్రి ఒంగోలులో సందడి చేసింది. ఏకే ఎంటర్‌టైన్మెంట్, హాస్య మూవీస్ పతాకంపై ఈ సినిమా నిర్మించగా, స్థానిక సత్యం థియేటర్‌కు హీరో శ్రీవిష్ణు, హీరోయిన్ రెబా మోనికాజాన్, దర్శకుడు రామ్ అబ్బరాజు, నిర్మాత రాజేష్ దండా వచ్చారు. అభిమానులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో థియేటర్ వద్ద కోలాహలం నెలకొంది.

వివాహిత అదృశ్యం

ఒంగోలు టౌన్: ప్రేమించి పెళ్లి చేసుకున్న రెండు నెలలకే వివాహిత అదృశ్యమైన సంఘటన ఒంగోలు నగరంలో చోటుచేసుకుంది. స్థానిక కరుణాకాలనీలో నివసించే యారిజర్ల చిరంజీవి ఫ్లెక్సీ డిజైనర్‌గా పనిచేస్తున్నాడు. హైదరాబాద్‌కు చెందిన కత్తి గౌతమి ఉరఫ్ స్టెల్లినీ ప్రేమించాడు. గౌతమికి తల్లిదండ్రులు లేరు. గత మే 25న కరుణాకాలనీలో ఇంటి సమీపంలోని చర్చిలో వివాహం చేసుకున్నారు. అప్పటి నుంచి ఒంగోలులోనే ఉంటున్నారు. ఆదివారం కేశవరాజుకుంటలోని కల్వరి టెంపుల్‌కి వెళ్లారు. వారితో పాటు చిరంజీవి సోదరి నిర్మల కూడా ఉన్నారు. చర్చిలో ప్రార్థన జరుగుతుండగా వాష్‌రూంకు వెళ్లి వస్తానని గౌతమి బయటకు వచ్చింది. ఎంతసేపటికీ తిరిగి రాలేదు. ప్రేయర్ తర్వాత చర్చి ఆవరణ అంతా వెతికినా కనిపించలేదు. ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ వస్తోంది. దీంతో తాలూకా పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఒంగోలు చేరిన భోగి గణపతి పాదయాత్ర



భోగి గణపతి పీఠం ఉపాసకులు రమణరాజు

ఒంగోలు టౌన్: కాకినాడ నుంచి తిరుమలగిరికి 41 రోజుల ప్రదక్షిణగా పాదయాత్ర చేపట్టిన కాకినాడ భోగి గణపతి పీఠం ఉపాసకుడు దూసర్లపూడి రమణరాజు తిరుగు ప్రయాణంలో సోమవారం రాత్రి ఒంగోలు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ మే 31న కాకినాడ నుంచి మొదలైన కాలినడక తిరుమల తిరుగుయాత్రలో 34వ రోజు ప్రకాశం జిల్లా చేరామన్నారు. రోజుకు 50 కి.మీ చొప్పున ఇప్పటికి వెయ్యి కి.మీ నడక పూర్తయిందన్నారు. మరో 300 కి.మీ నడకతో కాకినాడ పీఠానికి చేరుకుంటామని తెలిపారు. లోకకల్యాణార్థం భోగి మంటల్లో వెలసిన భోగి గణపతికి కవచ యజ్ఞంలో భాగంగా పవిత్ర తిరుమలకు 1300 కి.మీ ప్రదక్షిణ పాదయాత్ర చేస్తున్నామని తెలిపారు. యాత్రానంతరం శ్రీవారి పాదాల ప్రతిష్ఠ మహన్నాభిషేకం నవరాత్రుల్లో నిత్యాన్నదానం నిర్వహించే ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు.

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం రాత్రి 11.30 ముగింపు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
486	134
65,205	19,323

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

విదేశీ సూచీలు

నాస్‌డాక్	13,817	▲	29
డోజోన్స్	34,418	▲	11
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,527	▽	4
డాక్స్	16,081	▽	67
షాంఘై	3,244	▲	42
నికాయ్	33,753	▲	564

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (24 క్యారట్)	57,730
బంగారం (22 క్యారట్)	54,980
వెండి (కిలో)	75,500

జియో భారత్ ఫోన్ @ రూ. 999

రూ. 123 నెలవారీ ప్లాన్‌తో అపరిమిత కాల్స్, 14 జీబీ డేటా



న్యూఢిల్లీ: టెలికం సంస్థ జియో తాజాగా ఇంటర్నెట్ ఆధారిత చౌక 'జియో భారత్' మొబైల్ ఫోన్లను ఆవిష్కరించింది. దీని ధర రూ. 999. నెలవారీ రీచార్జి రూ. 123గా ఉంటుంది. దీనితో అపరిమిత వాయిస్ కాల్స్, 14 జీబీ డేటా లభిస్తుంది. జూలై 7 నుంచి 10 లక్షల పైచిలుకు జియో భారత్ ఫోన్ల ప్రయోగాత్మక ట్రయల్స్ ప్రారంభమవుతాయని జియో ఒక ప్రకటనలో తెలిపింది. ఇతర ఆపరేటర్లు అందిస్తున్న ఫీచర్ ఫోన్ నెలవారీ ప్లాన్లతో పోలిస్తే 30 శాతం చౌకగా, 7 రెట్లు ఎక్కువ డేటాను యూజర్లు పొందవచ్చని పేర్కొంది. 2జీ విముక్త భారత్ లక్ష్య సాధనను వేగవంతం చేసే దిశగా జియో ఈ మొబైల్స్‌ను ప్రవేశపెట్టింది. ప్రస్తుతం 25 కోట్ల పైచిలుకు 2జీ ఫీచర్ ఫోన్లను వాడుతున్నారని అంచనా. ఒకవైపు ప్రపంచం 5జీ విప్లవం ముంగిట నిల్చుండగా.. 25 కోట్ల మంది ఇంకా 2జీ శకంలోనే చిక్కుబడిపోయి ఉన్నారని, ప్రాథమిక ఇంటర్నెట్ ప్రయోజనాలను కూడా పొందడం లేదని రిలయన్స్ జియో చైర్మన్ ఆకాశ్ అంబానీ తెలిపారు. డిజిటల్ సమాజంలో.. టెక్నాలజీ ప్రయోజనాలు ఏ కొందరికో పరిమితం కాకుండా ప్రతి ఒక్కరికీ అందుబాటులోకి తెచ్చే దిశగా జియో భారత్ ఫోన్ మరో ముందడుగని ఆయన పేర్కొన్నారు.

ప్రియం కానున్న టాటా కార్లు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహన తయారీ దిగ్గజం టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికిల్స్ ధరలను సవరిస్తున్నట్టు ప్రకటించింది. సగటున 0.6 శాతం ధర పెంచుతున్నట్టు సోమవారం వెల్లడించింది. తయారీ వ్యయం పెరగడంతో కంపెనీ ఈ నిర్ణయం తీసుకుంది. ఎలక్ట్రిక్ వెహికల్స్‌తోసహా అన్ని మోడళ్లు, వేరియంట్లకు ఇది వర్తిస్తుందని స్పష్టం చేసింది. కొత్త ధరలు జూలై 17 నుంచి అమలులోకి వస్తాయని టాటా మోటార్స్ తెలిపింది. జూలై 16 వరకు నమోదయ్యే బుకింగ్స్, జూలై 31లోగా జరిగే డెలివరీలకు పాత ధరలు వర్తిస్తాయని వెల్లడించింది

సెన్సెక్స్ @ 65000

- 19,300 పైకి నిఫ్టీ
- ర్యాలీకి అధిక వెయిటేజీ షేర్ల దన్ను
- ఇంధన, ఆర్థిక, మెటల్ షేర్లకు డిమాండ్
- మూడోరోజూ కొత్త రికార్డుల నమోదు



సెన్సెక్స్ మైలురాళ్లు

స్థాయి	అందుకున్న తేది
65,000	జూలై 03 2023
64,000	జూన్ 28 2023
63,000	నవంబర్ 30 2022
62,000	అక్టోబర్ 19 2021
61,000	అక్టోబర్ 14 2021

ముంబై: సానుకూల జాతీయ, అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో స్టాక్ సూచీల రికార్డు ర్యాలీ సోమవారమూ కొనసాగింది. అధిక వెయిటేజీ రిలయన్స్, ఐటీసీ, హెచ్‌డీఎఫ్ ద్వయం షేర్లు రాణించడం, విదేశీ ఇన్వెస్టర్ల కొనుగోళ్లు కలిసొచ్చాయి. దేశీయంగా మెరుగైన స్థూల ఆర్థిక గణాంకాలు నమోదు, ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలోని సానుకూలతలు సెంటిమెంట్‌ను మరింత బలపరిచాయి. సెన్సెక్స్ ఉదయం 117 పాయింట్ల లాభంతో 64,836 వద్ద మొదలైంది. నిఫ్టీ 58 పాయింట్లు పెరిగి 19,247 వద్ద ట్రేడింగ్‌ను ప్రారంభించింది. తొలి గంట తర్వాత ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు పాల్పడటంతో సూచీలు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. అయితే మిడ్‌సెషన్ సమయంలో యూరప్ మార్కెట్ల లాభాల ప్రారంభం ఇన్వెస్టర్లకు ఉత్సాహాన్నిచ్చింది. ఇంధన, ఆర్థిక, మెటల్, ఎఫ్ఎంసీజీ రంగాల షేర్లలో అధికంగా కొనుగోళ్లు జరిగాయి. ఇంట్రాడేలో వరుసగా మూడోరోజూ సెన్సెక్స్ 581 పాయింట్లు పెరిగి 65,300 వద్ద, నిఫ్టీ 156 పాయింట్లు బలపడి 19,345 కొత్త జీవితకాల గరిష్టాలను నమోదు చేసాయి. చివరికి సెన్సెక్స్ 486 పాయింట్ల లాభంతో 65,205 వద్ద ముగిసింది. ఈ సూచీకిది వరుసగా నాలుగోరోజూ లాభాల ముగింపు. మార్కెట్ ముగిసేసరికి 134 పాయింట్లు బలపడి 19,323 వద్ద స్థిరపడింది. లార్జ్ క్యాప్ షేర్లతో పాటు చిన్న, మధ్య తరహా షేర్లకూ డిమాండ్ నెలకొంది. ఫలితంగా బీఎస్ఈ మిడ్, స్మాల్ సూచీలు 0.56%, 0.30% చొప్పున లాభపడ్డాయి. జూన్ వాహన విక్రయాలు అంతంత మాత్రంగా ఉండటంతో ఆటో షేర్లు నష్టపోయాయి. ఐటీ, టెక్, విద్యుత్ షేర్లూ అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. డాలర్ మారకంలో రూపాయి విలువ 15 పైసలు బలపడి 81.95 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్ అరశాతానికి పైగా ర్యాలీ చేయడంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్ఈ కంపెనీల మొత్తం విలువ రూ.1.73 లక్షల కోట్లు పెరిగి జీవితకాల గరిష్ట స్థాయి రూ.2.98 లక్షల కోట్లకు చేరింది. ద్రవ్యోల్బణం దిగిరావడంతో కేంద్ర బ్యాంకులు వడ్డీరేట్ల సైకిల్‌ను ఆపేయ్యొచ్చనే అంచనాలతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు లాభాల్లో కదలాడుతున్నాయి. ఆసియాలో జపాన్ ఇండెక్స్ నికాయ్ 33 ఏళ్ల గరిష్టం(33,753) ముగిసింది.

''మార్కెట్లో కొనసాగుతున్న ర్యాలీతో పలు షేర్ల వాల్యుయేషన్లు భారీగా పెరిగాయి. నిఫ్టీ ఎఫ్‌వై 24 ఆదాయ అంచనాకు 20 రెట్ల అధిక ప్రీమియంతో ట్రేడవుతోంది. ఇది చరిత్రాత్మక సగటు కంటే ఎక్కువ. ప్రస్తుతం నెలకొన్న సానుకూల పరిస్థితులు మార్కెట్‌ను మరింత ముందుకు తీసుకెళ్లే వీలుంది. ఏదైన చిన్న ప్రతికూలాంశం అనూహ్య దిద్దుబాటుకు దారి తీయవచ్చు. కావున పెట్టుబడులు పెట్టేటప్పుడు ఇన్వెస్టర్లు అప్రమత్తత వహించాలి'' అని జియోజిత్ ఫైనాన్సియల్ సర్వీసెస్ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ వ్యూహకర్త వీకే విజయ కుమార్ తెలిపారు.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- విలీనం తర్వాత తొలి ట్రేడింగ్ సెషన్‌లో హెచ్‌డీఎఫ్‌సీ ద్వయం షేర్లు సానుకూలంగా స్పందించాయి. ఇంట్రాడేలో హెచ్‌డీఎఫ్‌సీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు వరుసగా 4%, 3% చొప్పున ర్యాలీ చేసి రూ.2,926 వద్ద, రూ.1,758 వద్ద ఏడాది గరిష్టాన్ని తాకాయి. చివరికి హెచ్‌డీఎఫ్‌సీ షేరు 2% లాభంతో రూ.2,871 వద్ద ముగిసింది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు షేరు ఒక శాతం పెరిగి రూ.1,719 వద్ద స్థిరపడింది. మొత్తంగా ఈ రెండు కంపెనీల మార్కెట్ విలువ రూ.14.93 లక్షల కోట్లకు పెరిగింది.
- ఎన్ఎస్ఈలో బ్యాంక్ నిఫ్టీ సూచీ ఏడాది గరిష్టం (45,353) తాకింది. చివరికి ఒకశాతం లాభంతో 45,158 వద్ద స్థిరపడింది. నిఫ్టీ ఫైనాన్సియల్ సర్వీసెస్ ఇండెక్స్ సైతం 52 వారాల గరిష్టం(20,398) అందుకొని ఆఖరికి 1% లాభంతో 20,253 వద్ద నిలిచింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100, స్మాల్‌క్యాప్ సూచీలు సైతం జీవితకాల గరిష్ట స్థాయి వద్ద ముగిశాయి.

మైక్రోచిప్.. రూ.2,460 కోట్ల పెట్టుబడి



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఎంబెడెడ్ కంట్రోల్ సొల్యూషన్స్‌లో ఉన్న యూఎస్ కంపెనీ మైక్రోచిప్ టెక్నాలజీ భారత్‌లో రూ.2,460 కోట్ల పెట్టుబడి చేయనున్నట్టు ప్రకటించింది. కార్యకలాపాల విస్తరణ, ఇంజనీరింగ్ ల్యాబ్స్, నిపుణుల నియామకం, సాంకేతిక కేంద్రాలకు మద్దతు, విద్యా సంస్థలకు ఈ మొత్తాన్ని వెచ్చించనుంది. కాగా, ఇక్కడి కోకాపేట్ బిజినెస్ డిస్ట్రిక్ట్‌లో ఉన్న వన్ గోల్డెన్ మైల్ ఆఫీస్ టవర్‌లో 5 అంతస్తులను కంపెనీ కొనుగోలు చేసింది. పరిశోధన, అభివృద్ధి కార్యాలయాన్ని నూతన భవనంలోకి మార్చింది. ఈ కేంద్రంలో 1,000 మంది ఉద్యోగులు కూర్చునే వీలుంది. భారత్‌లో కార్యకలాపాలను పెంపొందించడానికి మైక్రోచిప్ ముఖ్యమైన వ్యూహాత్మక నిబద్ధతను ప్రకటించిందని సంస్థ ప్రెసిడెంట్, సీఈవో గణేశ్ మూర్తి ఈ సందర్భంగా మీడియాకు తెలిపారు. ఇండస్ట్రియల్, డేటా సెంటర్, కంప్యూటింగ్, ఆటోమోటివ్, కన్స్యూమర్ అప్లయాన్సెస్, ఏరోస్పేస్, డిఫెన్స్ వంటి రంగాలకు మైక్రోచిప్ సేవలు అందిస్తోంది.

గిఫ్ట్ నిఫ్టీలో ట్రేడింగ్ ప్రారంభం..

తొలి సెషన్‌లో 1.12 బిలియన్ డాలర్ల లావాదేవీలు



గాంధీనగర్: సింగపూర్ ఎస్‌జీఎక్స్ నిఫ్టీ స్థానంలో ప్రవేశపెట్టిన గిఫ్ట్ నిఫ్టీలో సోమవారం నుంచి ట్రేడింగ్ ప్రారంభమైంది. ఎస్‌జీఎక్స్ నిఫ్టీకి సంబంధించిన 9.4 బిలియన్ డాలర్ల ఓపెన్ ఇంట్రెస్ట్‌ను గిఫ్ట్ నిఫ్టీకి బదలాయించగా.. మొదటి రోజున తొలి సెషన్‌లో 1.12 బిలియన్ డాలర్ల విలువ చేసే లావాదేవీల పరిమాణం నమోదైంది. గుజరాత్‌లోని గిఫ్ట్ సిటీలో గిఫ్ట్ నిఫ్టీ ట్రేడింగ్ ప్రారంభ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇప్పటివరకు తమ ట్రేడింగ్‌లో కొంత భాగం విదేశాల్లో జరిగేదని, ఇప్పుడిక పూర్తిగా దేశీయంగానే నిర్వహించవచ్చని నేషనల్ స్టాక్ ఎక్స్చేంజీ (ఎన్ఎస్ఈ) ఎండీ ఆశిష్ చౌహాన్, ఎన్ఎస్ఈ ఐఎక్స్ ఎండీ వి. బాలసుబ్రమణియమ్ తెలిపారు.

రెండు సెషన్లలో.. దాదాపు 21 గంటలు..

గిఫ్ట్ నిఫ్టీలో ట్రేడింగ్ అంతా అమెరికన్ డాలర్ల మారకంలో జరుగుతుంది. ఉదయం 6.30 గం.ల నుంచి మరుసటి రోజు 2.45 గం.ల వరకు రెండు సెషన్లుగా, దాదాపు 21 గంటల పాటు ఇందులో ట్రేడింగ్ కొనసాగుతుంది. తొలుత గిఫ్ట్ నిఫ్టీ 50, గిఫ్ట్ నిఫ్టీ బ్యాంక్, గిఫ్ట్ నిఫ్టీ ఫైనాన్షియల్ సర్వీసెస్, గిఫ్ట్ నిఫ్టీ ఐటీ డెరివేటివ్ కాంట్రాక్టులు ఎన్ఎస్ఈ ఐఎక్స్‌లో అందుబాటులో ఉంటాయి. తర్వాత మరిన్ని సూచీలను క్రమంగా అందుబాటులోకి తెస్తారు. సాధారణంగా దేశీ మార్కెట్ల ఓపెనింగ్‌ను అంచనా వేసేందుకు ట్రేడర్లు ఎస్‌జీఎక్స్ నిఫ్టీని పరిగణనలోకి తీసుకుంటారు.

ఐడీఎఫ్‌సీ బ్యాంకులో ఐడీఎఫ్‌సీ విలీనానికి ఓకే

ముంబై: ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంకులో మాతృ సంస్థ ఐడీఎఫ్‌సీ లిమిటెడ్ విలీనం కానుంది. పూర్తిగా షేర్ల మార్పిడి ద్వారా లావాదేవీని చేపట్టనున్నారు. ఇందుకు రెండు సంస్థల బోర్డులూ ఆమోదించినట్లు ఐడీఎఫ్‌సీ, ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంకు తాజాగా వెల్లడించాయి. విలీన ప్రతిపాదన ప్రకారం ఐడీఎఫ్‌సీ వాటాదారులకు తమ వద్దగల ప్రతీ 100 షేర్లకుగాను 155 ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంకు షేర్లు జారీ చేయనున్నారు. ప్రధానంగా మౌలిక రంగానికి రుణాలందించే ఐడీఎఫ్‌సీ 1997లో ఆవిర్భవించింది. 2015లో ఐసీఐసీఐ, ఐడీబీఐ తరహాలో బ్యాంకింగ్ అనుబంధ సంస్థను ఏర్పాటు చేసింది. 2018 డిసెంబర్‌లో క్యాపిటల్ ఫస్ట్‌ను టేకోవర్ చేసింది.

పవన్ హన్స్ విక్రయం రద్దు

గెలుపొందిన బిడ్డర్ అనర్హత ఎఫెక్ట్



న్యూఢిల్లీ: హెలికాప్టర్ సర్వీసుల పీఎస్‌యూ పవన్ హన్స్ లో వ్యూహాత్మక వాటా విక్రయానికి బ్రేక్ పడింది. బిడ్డింగ్‌లో విజయవంతమైన కన్సార్షియంలోని ఒక కంపెనీపై న్యాయపరమైన వివాదాల రీత్యా అనర్హతవేటు పడటం దీనికి కారణమని దీపమ్ పేర్కొంది. వెరసి పవన్ హన్స్ ప్రయివేటైజేషన్ ప్రయత్నాలకు మూడోసారి చెక్ పడింది. బిడ్‌ను గెలుపొందిన స్టార్9 మొబిలిటీ ప్రయివేట్ లిమిటెడ్ కన్సార్షియంలోని అల్మాస్ గ్లోబల్ అపార్చునిటీ ఫండ్ ఎస్‌పీసీపై పెండింగ్ కేసుల నేపథ్యంలో ప్రభుత్వం పవన్ హన్స్ డిజిన్వెస్ట్‌మెంట్ నిర్ణయాన్ని రద్దు చేసినట్లు దీపమ్ తెలియజేసింది. భాగస్వామ్య కంపెనీ పవన్ హన్స్‌లో ప్రభుత్వానికి 51 శాతం, ఇంధన రంగ పీఎస్‌యూ దిగ్గజం ఓఎన్‌జీసీకి 49 శాతం చొప్పున వాటా ఉంది.

2018లో షురూ: తొలుత పవన్ హన్స్ లో గల 51 శాతం వాటా విక్రయానికి ప్రభుత్వం 2018లో బిడ్స్‌కు ఆహ్వానం పలికింది. అయితే ఓఎన్‌జీసీ సైతం 49 శాతం వాటాను విక్రయించేందుకు సిద్ధపడటంతో నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంది. 2019లో తిరిగి కంపెనీలో 100 శాతం వాటా విక్రయానికి బిడ్స్‌ను ఆహ్వానించినప్పటికీ స్పందన లభించకపోవడం గమనార్హం! ప్రభుత్వం 2020 డిసెంబర్‌లో మూడోసారి పవన్ హన్స్ విక్రయానికి తెరతీసింది. కంపెనీ కొనుగోలుకి ఆసక్తి వ్యక్తీకరణ(ఈవోఐ) బిడ్స్‌ను ఆహ్వానించింది. 2022 ఏప్రిల్‌లో స్టార్9 మొబిలిటీ కన్సార్షియం గరిష్ట బిడ్డర్‌గా నిలిచింది. కన్సార్షియంలో అల్మాస్ గ్లోబల్ అపార్చునిటీసహా.. బిగ్ చార్టర్ ప్రయివేట్ లిమిటెడ్, మహరాజ ఏవియేషన్ ప్రయివేట్ లిమిటెడ్ సైతం భాగస్వాములుగా ఉన్న సంగతి తెలిసిందే.

విద్య, ఉద్యోగ సమాచారం

సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో 1000 మేనేజర్ స్కేల్-2 పోస్టులు

సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, హ్యూమన్ క్యాపిటల్ మేనేజ్‌మెంట్ డిపార్ట్‌మెంట్.. రెగ్యులర్ ప్రాతిపదికన దేశవ్యాప్తంగా ఉన్న బ్యాంకు శాఖల్లో మెయిన్ స్ట్రీమ్ కేటగిరీలో మిడిల్ మేనేజ్‌మెంట్ గ్రేడ్ స్కేల్-2 మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » మొత్తం పోస్టుల సంఖ్య: 1000
- » అర్హత:ఏదైనా డిగ్రీ,సీఏఐఐబీ ఉత్తీర్ణులై ఉండాలి. పీఎస్‌బీ/ప్రైవేట్ సెక్టార్ బ్యాంక్/ఆర్ఆర్‌బీలో ఆఫీసర్‌గా మూడేళ్ల పని అనుభవం ఉండాలి(లేదా) పీఎస్‌బీ/ప్రైవేట్ సెక్టార్ బ్యాంక్/ఆర్ఆర్‌బీలో క్లర్క్‌గా ఆరేళ్ల పని అనుభవంతోపాటు సంబంధిత విభాగంలో ఎంబీఏ/ఎంసీఏ/పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి.
- » వయసు: 31.05.2023 నాటికి 32 ఏళ్లు మించకూడదు.
- » పే స్కేల్: నెలకు రూ.48,170 నుంచి రూ.69,810 చెల్లిస్తారు.
- » పోస్టింగ్ స్థలం: దేశవ్యాప్తంగా ఉన్న సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖల్లో
- » దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- » ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:15.07.2023
- » ఆన్‌లైన్ పరీక్ష తేది:ఆగస్టు రెండు/మూడో వారం
- » వెబ్‌సైట్: www.centralbankofindia.co.in

ఐబీపీఎస్ 4,045 క్లర్క్ పోస్టులు

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలక్షన్(ఐబీపీఎస్).. 2024-25 సంవత్సరానికి సంబంధించి కామన్ రిక్రూట్‌మెంట్ ప్రాసెస్(సీఆర్‌పీ)-XIII.. క్లర్క్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్‌ను విడుదల చేసింది.

- » మొత్తం పోస్టుల సంఖ్య:4,045 క్లర్క్ పోస్టులు
- » అర్హత: ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. కనీస కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలి.
- » వయసు: 20 నుంచి 28 ఏళ్ల మధ్య ఉండాలి.
- » ఎంపిక విధానం: రెండు దశల్లో కంప్యూటర్ ఆధారిత రాతపరీక్ష ఉంటుంది. మొదట 100 మార్కులకు ప్రిలిమ్స్, రెండో దశలో 200 మార్కులకు మెయిన్స్ ఉంటాయి. ప్రిలిమ్స్‌లో అర్హత సాధించిన వారికి మాత్రమే మెయిన్స్ రాసే అవకాశం ఉంటుంది.
- » ప్రిలిమినరీ పరీక్ష తేది:2023 ఆగస్టు/సెప్టెంబర్‌ల్లో
- » మెయిన్స్ పరీక్ష తేది: అక్టోబర్ 2023లో నిర్వహిస్తారు
- » దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- » ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:21.07.2023
- » వెబ్‌సైట్: www.ibps.in

కేజీబీవీల్లో 1241 కొలువులు

కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయా(కేజీబీవీ)లు, అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్స్(యూఆర్ఎస్)ల్లో 1241 పోస్టుల భర్తీకి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. కాంట్రాక్ట్ ప్రాతిపదికన భర్తీ చేసే ఈ పోస్టులకు ఆన్‌లైన్ రాత పరీక్ష ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. జూన్ 26 నుంచి దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో పోస్టుల సంఖ్య, అర్హతలు, ఎంపిక విధానం, పరీక్ష స్వరూపం, ప్రిపరేషన్ తదితర వివరాలు..



పోస్టుల వివరాలు

కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయా(కేజీబీవీ)ల్లో.. స్పెషల్ ఆఫీసర్స్(ఎస్‌వో), పోస్టు గ్రాడ్యుయేట్ కాంట్రాక్ట్ రెసిడెంట్ టీచర్స్(పీజీ సీఆర్‌టీ), కాంట్రాక్ట్ రెసిడెంట్ టీచర్స్(సీఆర్‌టీ), ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్(పీఈటీ) పోస్టులు; అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్(యూఆర్ ఎస్)ల్లో.. స్పెషల్ ఆఫీసర్స్(ఎస్‌వో), కాంట్రాక్ట్ రెసిడెంట్ టీచర్స్(సీఆర్‌టీ) పోస్టులు భర్తీ చేయనున్నారు.

మొత్తం పోస్టుల సంఖ్య: 1241

- కేజీబీవీ-పోస్టులు 1218: స్పెషల్ ఆఫీసర్-38, పీజీ సీఆర్‌టీ(ఇంగ్లిష్)-110, పీజీ సీఆర్‌టీ(మ్యాథమేటిక్స్)-60, పీజీ సీఆర్‌టీ(నర్సింగ్)-160, పీజీ సీఆర్‌టీ(తెలుగు)-104, పీజీ సీఆర్‌టీ(ఉర్దూ)-2, పీజీ సీఆర్‌టీ(బోటనీ)-55, పీజీ సీఆర్‌టీ(కెమిస్ట్రీ)-69,పీజీ సీఆర్‌టీ(సివిక్స్)-55, పీజీ సీఆర్‌టీ(కామర్స్)-70, పీజీ సీఆర్‌టీ(ఎకనామిక్స్)-54, పీజీ సీఆర్‌టీ(ఫిజిక్స్)-56, పీజీ సీఆర్‌టీ(జువాలజీ)-54, సీఆర్‌టీ(బయో సైన్స్)-25, సీఆర్‌టీ(ఇంగ్లిష్)-52, సీఆర్‌టీ(హిందీ)-37, సీఆర్‌టీ(మ్యాథమెటిక్స్)-45,సీఆర్‌టీ(ఫిజికల్ సైన్స్)-42, సీఆర్‌టీ(సోషల్ స్టడీస్)-26, సీఆర్‌టీ(తెలుగు)-27, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్-77.
- యూఆర్ఎస్-మొత్తం పోస్టులు-23: స్పెషల్ ఆఫీసర్-4,సీఆర్‌టీ(తెలుగు)-5, సీఆర్‌టీ(ఇంగ్లిష్)-5,సీఆర్‌టీ(సైన్స్)-6,సీఆర్‌టీ(సోషల్ స్టడీస్)-3

విద్యార్హతలు

- పీజీసీఆర్‌టీ: 50 శాతం మార్కులతో సంబంధిత సబ్జెక్టులో పోస్టు గ్రాడ్యుయేషన్ తోపాటు బీఈడీ పూర్తి చేసి ఉండాలి.
- స్పెషల్ ఆఫీసర్: కనీసం 50 శాతం మార్కులతో సంబంధిత సబ్జెక్టులో పోస్టు గ్రాడ్యుయేషన్‌తో పాటు బీఈడీ పూర్తి చేసి ఉండాలి. తెలంగాణ స్టేట్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టీఎస్ టెట్)/ఆంధ్రప్రదేశ్ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (2014.06.02 కంటే ముందు నిర్వహించిన ఏపీ టెట్)/సెంట్రల్ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్(సీటెట్) పేపర్ 2లో ఉత్తీర్ణత సాధించాలి.
- సీఆర్‌టీ: 50 శాతం మార్కులతో సంబంధిత సబ్జెక్టుల్లో గ్రాడ్యుయేషన్/పోస్టు గ్రాడ్యుయేషన్‌తో పాటు బీఈడీ పూర్తి చేయాలి. తెలంగాణ స్టేట్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టీఎస్ టెట్)/ఆంధ్రప్రదేశ్ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (2014.06.02 కంటే ముందు నిర్వహించిన ఏపీ టెట్)/సెంట్రల్ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (సీటెట్) పేపర్ 2లో ఉత్తీర్ణతఉండాలి.
- పీఈటీ: కనీసం 50 శాతం మార్కులతో ఇంటర్మీడియెట్‌తోపాటు ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో సర్టిఫికెట్/డిప్లొమా ఉండాలి. లేదా బ్యాచిలర్ డిగ్రీతో పాటు కనీసం ఏడాది వ్యవధి ఉన్న బ్యాచిలర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్(బీపీఈడీ)లో ఉత్తీర్ణత సాధించాలి.
- కస్తూర్బా గాంధీ బాలికా పాఠశాలల్లో స్పెషల్ ఆఫీసర్, సీఆర్‌టీ, పీఈటీ, పీజీసీఆర్‌టీ పోస్టులకు మహిళా అభ్యర్థులు మాత్రమే అర్హులు. ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ పోస్టులకు దివ్యాంగులు అనర్హులు.

వయసు

2023 జూలై 1 నాటికి అభ్యర్థుల వయసు 18 నుంచి 44 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ/ఎస్టీ/బీసీ/ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు ఐదేళ్లు, ఎక్స్ సర్వీస్‌మెన్ అభ్యర్థులకు మూడేళ్లు, దివ్యాంగ అభ్యర్థులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.

ఎంపిక విధానం

రాత పరీక్షలో అర్హులైన అభ్యర్థుల ప్రతిభ, టెట్ స్కోరు, అనుభవం ఆధారంగా తుది ఎంపిక చేస్తారు. అన్ని పోస్టులకు రాత పరీక్షలో అర్హత సాధించాలంటే.. ఓసీ అభ్యర్థులు 40 శాతం మార్కులు, బీసీ అభ్యర్థులు 35 శాతం మార్కులు; ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ అభ్యర్థులు 30 శాతం మార్కులు సాధించాలి. పీఈటీ పోస్టులకు రాతపరీక్షలో మార్కుల(100 శాతం వెయిటేజీ) ఆధారంగా ఎంపిక చేస్తారు.

రాత పరీక్ష స్వరూపం

- పీజీసీఆర్‌టీ: మొత్తం 100 ప్రశ్నలు ఇస్తారు. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు. పరీక్ష కాలవ్యవధి 120 నిమిషాలు. జనరల్ స్టడీస్, బేసిక్ ప్రొఫిషీయెన్సీ ఇన్ ఇంగ్లిష్, పర్‌స్పెక్టివ్స్ ఇన్ ఎడ్యుకేషన్, సబ్జెక్టు కంటెంట్, పెడగాజీ విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు.
- స్పెషల్ ఆఫీసర్: మొత్తం 100 ప్రశ్నలు ఇస్తారు. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు. పరీక్ష కాలవ్యవధి 120 నిమిషాలు. జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్, బేసిక్ ప్రొఫిషీయెన్సీ ఇన్ ఇంగ్లిష్, పర్‌స్పెక్టివ్స్ ఇన్ ఎడ్యుకేషన్, పెడగాజీ, చైల్డ్ డెవలప్‌మెంట్, స్కూల్ మేనేజ్‌మెంట్ అడ్మినిస్ట్రేషన్ విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు.
- సీఆర్‌టీ: ఇందులో కూడా మొత్తం 100 ప్రశ్నలు ఇస్తారు. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు. పరీక్ష కాలవ్యవధి 120 నిమిషాలు. జనరల్ స్టడీస్, బేసిక్ ప్రొఫిషీయెన్సీ ఇన్ ఇంగ్లిష్, పర్‌స్పెక్టివ్స్ ఇన్ ఎడ్యుకేషన్, సబ్జెక్టు కంటెంట్, పెడగాజీ విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు.
- పీఈటీ: మొత్తం 100 ప్రశ్నలు ఇస్తారు. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు. పరీక్ష కాలవ్యవధి 120 నిమిషాలు. జనరల్ స్టడీస్, జనరల్ ఇంగ్లిష్‌తోపాటు ఫిజియాలజీ, ఫిజికల్ ఎడ్యుకేషన్, స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్, శిక్షణ తదితర అంశాలపై ప్రశ్నలు అడుగుతారు.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: schooledu.telangana.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: జూలై 5, 2023
- రాత పరీక్ష తేది: జూలై 2023
- వెబ్‌సైట్: https://schooledu.telangana.gov.in

ఐఐటీల్లో కొత్త కోర్సులు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ)లు ప్రతి ఏడాదిలాగానే ఈసారి కూడా విద్యార్థుల కోసం పలు కొత్త కోర్సులను ప్రవేశపెట్టాయి. ఏఐ, మెషిన్ లెర్నింగ్‌పై ఆసక్తి ఉన్న విద్యార్థుల కోసం ఐఐటీ గాంధీనగర్ బీటెక్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోర్సును రూపొందించింది. ఐఐటీ-ఇండోర్, ఐఐటీ-పాట్నాలో బీటెక్ ఇన్ ఇంజనీరింగ్ ఫిజిక్స్, ఐఐటీ బాంబేలో డ్యూయల్ డిగ్రీ ఇన్ క్వాంటం టెక్నాలజీ తదితర కోర్సులు అందుబాటులోకి వచ్చాయి. విద్యార్థులు తమ ఆసక్తి, సామర్థ్యాలకు తగిన కోర్సు ఎంచుకోవచ్చు. ఈ నేపథ్యంలో.. ఆయా కోర్సుల తీరుతెన్నులు, ప్రవేశం విధానం, కెరీర్ అవకాశాలు తదితర వివరాలు..



ఐఐటీ ఇండోర్

ఈ ఏడాది ఐఐటీ ఇండోర్ ఎక్కువ సంఖ్యలో కొత్త కోర్సులను ప్రారంభించింది. బీటెక్ ఇన్ ఇంజనీరింగ్ ఫిజిక్స్, బీటెక్ ఇన్ మ్యాథమేటిక్స్ అండ్ కంప్యూటింగ్, బీటెక్ ఇన్ స్పేస్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ కోర్సులను ప్రవేశపెట్టింది. 2023-24 విద్యాసంవత్సరం నుంచి ఐఐటీ ఇండోర్ ఈ కోర్సులలో ప్రవేశాలను ప్రారంభించనుంది. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో విద్యార్థుల ప్రతిభ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు.

ఐఐటీ పాట్నా

ఐఐటీ పాట్నా ఈ సంవత్సరం ఇంజనీరింగ్ ఫిజిక్స్‌లో కొత్తగా బీటెక్‌ను ప్రారంభించింది. ఫిజిక్స్‌లో ధ్వని శిక్షణ, విద్యార్థులకు సరికొత్త టెక్నాలజీలను పరిచయం చేయడం ఈ కోర్సు ప్రధాన ఉద్దేశం. సమకాలీన ఫిజిక్స్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌ను మిళితం చేసి విద్యార్థులను సైన్స్, టెక్నాలజీ రెండింటిలో సమాన సామర్థ్యాలుండే నిపుణులుగా తీర్చిదిద్దడమే ఈ కోర్సు లక్ష్యం.

ఐఐటీ బాంబే

ఐఐటీ బాంబే క్వాంటమ్ టెక్నాలజీలో ఇంటర్ డిసిప్లినరీ డ్యూయల్ డిగ్రీ ప్రోగ్రామ్ (ఐడీడీపీ)ను త్వరలో ప్రారంభించనుంది. ఈ కోర్సును సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ క్వాంటం ఇన్ఫర్మేషన్ కంప్యూటింగ్ సైన్స్ అండ్ టెక్నాలజీ(క్యూయూఐసీఎస్‌టీ) ఆఫర్ చేస్తోంది. ఐఐటీ బాంబేలో ఏదైనా బ్యాచిలర్ ఆఫ్ టెక్నాలజీ(బీటెక్) కోర్సులో చేరిన విద్యార్థులు ఐఐడీడీపీ ప్రోగ్రామ్‌లో నమోదు చేసుకోవచ్చు. డ్యూయల్ డిగ్రీ ప్రోగ్రామ్ నిర్మాణం ఇంకా ఖరారు కానప్పటికీ.. రెండేళ్ల కాలవ్యవధి ఉన్న ఈ కోర్సులో క్వాంటం టెక్నాలజీతోపాటు క్యూయూఐసీఎస్‌టీకి అనుబంధంగా ఉన్న పరిశోధనా బృందంతో చేపట్టే ప్రాజెక్ట్ వర్క్‌కు ప్రాధాన్యతనివ్వనున్నారు. ఇతర డ్యూయల్ డిగ్రీ ప్రోగ్రామ్‌ల మాదిరిగానే ఈ కొత్త కోర్సులో చేరిన విద్యార్థులు ఐదేళ్ల వ్యవధిలో బ్యాచిలర్స్, మాస్టర్స్ డిగ్రీని పూర్తిచేస్తారు. బీటెక్ విద్యార్థులు సంబంధిత కోర్సు మూడవ సంవత్సరంలో ఈ ప్రోగ్రామ్‌ను ఎంచుకోవచ్చు.

ఐఐటీ జోధ్‌పూర్

ఐఐటీ జోధ్‌పూర్‌లోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిజిక్స్.. కొత్తగా బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ ఇన్ ఫిజిక్స్ విత్ స్పెషలైజేషన్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించింది. బేసిక్ సైన్స్, అత్యాధునిక సాంకేతికతలపై ఆసక్తి ఉన్న విద్యార్థుల కోసం ఈ కోర్సును తీసుకువచ్చారు. విద్యార్థుల సామర్థ్యాలకు అనుగుణమైన స్పెషలైజేషన్ల ద్వారా వివిధ కెరీర్ మార్గాలను అందించడం ఈ కోర్సు లక్ష్యం. జేఈఈ అడ్వాన్స్‌డ్ స్కోరు ఆధారంగా ఈ కోర్సులో ప్రవేశాలు కల్పిస్తారు. నాలుగేళ్ల ఈ ప్రోగ్రామ్‌ను ఎనిమిది సెమిస్టర్‌లుగా విభజించారు.

ఐఐటీ హైదరాబాద్

ఐఐటీ, హైదరాబాద్.. బయోటెక్నాలజీ, బయోఇన్ఫర్మేటిక్స్‌లో పరిశ్రమ ఆధారిత బీటెక్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించింది. ఈ కోర్సును అభ్యసించే విద్యార్థులు బయోలాజికల్ డేటాను అర్థం చేసుకోవడానికి అవసరమైన ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, కంప్యూటర్ సైన్స్‌లోనూ శిక్షణ పొందుతారు. ఇది ఎనిమిది సెమిస్టర్లు, నాలుగేళ్ల కాలవ్యవధి ఉన్న ఫుల్‌టైమ్ కోర్సు. జేఈఈ అడ్వాన్స్‌డ్ ర్యాంకింగ్స్ ఆధారంగా అడ్మిషన్ కల్పిస్తారు.

ఐఐటీ గాంధీనగర్

ఐఐటీ, గాంధీనగర్.. బీటెక్ ఇన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోర్సును ప్రవేశపెట్టింది. దీనిలోని కొన్ని సబ్జెక్టులు బీటెక్ కంప్యూటర్ సైన్స్‌లోని సబ్జెక్టులతో ఉమ్మడిగా ఉన్నప్పటికీ.. చాలా సబ్జెక్టులు భిన్నంగా ఉన్నాయి. ఏఐ, మెషిన్ లెర్నింగ్‌పై ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈ కోర్సును ఎంచుకోవచ్చు. ఏఐ,మెషిన్ లెర్నింగ్ లో విద్యార్థులు పట్టుసాధించేలా కరిక్యులాన్ని రూపొందించారు. అంతేకాకుండా ఎలక్టివ్స్ సౌకర్యం ఉండటంతో విద్యార్థులు ఏఐకు చెందిన వివిధ విభాగాలు, కంప్యూటర్ విజన్, నేచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్ తదితర అడ్వాన్స్‌డ్ ఏఐ అంశాలను ప్రత్యేకంగా ఎంచుకోవచ్చు.

ఈ కోర్సు పూర్తి చేయడం ద్వారా విద్యార్థులు పరిశ్రమలో అప్లయిడ్ ఏఐలో అద్భుత కెరీర్ సొంతం చేసుకోవచ్చు. బీటెక్ ఇన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోర్సును నాలుగేళ్లు, ఎనిమిది సెమిస్టర్‌లుగా పేర్కొన్నారు. జేఈఈ అడ్వాన్స్‌డ్ స్కోర్ ఆధారంగా దీనిలో ప్రవేశం కల్పిస్తారు. ఐఐటీ పాట్నా, ఐఐటీ గువాహటిలోనూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి.